# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :134 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 29-07-2025 | పేజీలు:4 వెల: 2.00

## వీఐపీలు ఏడాదికి ఒక్కసారే శ్రీవారి దర్శనానికి రావాలి..!

తిరుమల:కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనానికి ప్రతీరోజూ వేలాది మంది తరలివస్తుంటారు.. ఒక ఏడైనా ప్రత్యేకమైన రోజు ఉందంటే చాలు..వీఐపీల తాకిడి ఉంటుంది.. అయితే, కొన్నిసార్లు వీఐపీల తాకిడితో సామాన్య భక్తులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి.. అయితే, తిరుమలలో వీఐపీల దర్శనంపై కీలక వ్యాఖ్యలు చేశారు భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు.. వీఐపీలు ఏడాదికి ఒక్కసారి మాత్రమే శ్రీవారి దర్శనానికి రావాలంటూ సూచించారు.. శ్రీవారి దర్శనార్థం కుటుంబ సభ్యులతో కలిసి నిన్న తిరుమల చేరుకున్న వెంకయ్య నాయుడు.. ఇవాళ ఉదయం వీఐపీ బ్రేక్ దర్శనంలో స్వామివారిని దర్శించుకున్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వదించగా.. అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన వెంకయ్యనాయుడు.. టీటీడీ నిధుల వ్యయంలో రాజకీయ జోక్యం ఉండకూడదన్నారు.. టీటీడీ నిధులను శ్రీవారి భక్తుల సౌకర్యాలకే వినియోగించాలన్నారు వెంకయ్య నాయుడు.

## రూ.5 కోట్ల విలువైన గంజాయి సీజ్... ముగ్గురు అరెస్ట్, ఇద్దరు పరారీ



హైదరాబాద్,పోలీసులు ఎంతలా అరికట్టాలని చూస్తున్నప్పటికీ నగరంలో డ్రగ్స్, గంజాయి పట్టుబడుతూనే ఉంది. మరోసారి పోలీసుల తనిఖీల్లో రూ.5 కోట్ల విలువైన గంజాయి పట్టుబడింది. హైదరాబాద్‌లోని బాటసింగారంలో భారీగా గంజాయి పట్టుకున్నారు. ఒడిశా, ఏపీ నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తుండగా రూ.5 కోట్ల విలువైన...పోలీసులు ఎంతలా అరికట్టాలని చూస్తున్నప్పటికీ నగరంలో డ్రగ్స్, గంజాయి పట్టుబడుతూనే ఉంది. మరోసారి పోలీసుల తనిఖీల్లో రూ.5 కోట్ల విలువైన గంజాయి పట్టుబడింది. హైదరాబాద్‌లోని బాటసింగారంలో భారీగా గంజాయి పట్టుకున్నారు. ఒడిశా, ఏపీ నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తుండగా రూ.5 కోట్ల విలువైన గంజాయి సీజ్ చేశారు పోలీసులు. 934 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుంది ఈగల్ టీమ్. DCM వాహనంలో పండ్ల బాక్స్‌ల మధ్యలో గంజాయిని తరలిస్తూ దొరికిపోయారు. ఈ ఘటనలో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇద్దరు నిందితులు పరారయ్యారు. పారిపోయిన నిందితుల కోసం పోలీసులు వేటాడుతున్నారు.ఓపక్క డ్రగ్స్, మరోవైపు గంజాయి. కొత్త మత్తు కోసం కొందరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, బడాబాబులు వెంపర్లాడుతుంటే.. ఏదో మార్గాల్లో అవి మహా నగరానికి చేరిపోతున్నాయి. దీంతో ఉక్కుపాదం మోపుతున్న పోలీసులు ఎప్పటికప్పుడు డ్రగ్స్, గాంజా ఆటకట్టిస్తున్నారు. గంజాయ్, డ్రగ్స్‌ను అరికట్టేందుకు డెకాయ్ అపరేషన్ నిర్వహిస్తున్నారు.దేశంలో ఎక్కడ గంజాయి పట్టుకున్నా ఆ మూలాలు ఏపీ, ఒడిశా వైపే చూపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం గంజాయి సాగును నిర్మూలించడానికి కఠిన చర్యలు చేపట్టింది. ఈ చర్యలు చాలావరకు ఫలించాయనుకుంటున్న తరుణంలో చాపకింద నీరులా గంజాయి సాగు విస్తరిస్తుండటాన్ని పోలీసులు గుర్తించారు. గంజాయి సాగవుతన్న ప్రాంతాలైన పాడేరు, పెదబయలు, ముంజంగిపుట్టు సహా మరికొన్ని మండలాలపై నిఘా పెంచారు.ఇతర రాష్ట్రాల నుంచి మన్యం మీదుగా రవాణా జరుగుతుండడంపై అధికారుల దృష్టిపెట్టారు. ఆంధ్రా ఒరిస్సా సరిహద్దుల వెంట 26 చెక్ పోస్టులు నిర్వహిస్తున్నారు. సీసీ టీవీల ద్వారా గంజాయి రవాణాదారులను గుర్తించి చర్యలు చేపడుతున్నారు. గత ఏడాది ఏర్పాటైన ఈగల్ వ్యవస్థ క్రియాశీలంగా పనిచేస్తోంది.

## పహల్గాంకు ఉగ్రవాదులు ఎలా వచ్చారు?..బోర్డర్‌లో భద్రత లేదా?



ఢిల్లీ: పార్లమెంట్‌లో ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు రంగం సిద్ధమైంది. కాసేపట్లో లోక్‌సభలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్‌పై మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం చేసిన వ్యాఖ్యలకు బీజేపీ నేతలు కౌంటరిస్తున్నారు. ఆయన వ్యాఖ్యలపై పాకిస్తాన్‌కు కాంగ్రెస్ క్లీన్ చిట్ ఇచ్చిందని బీజేపీ ఆరోపించింది.అయితే, కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. పహల్గాం ఉగ్రదాడిలో స్వదేశీ ఉగ్రవాదులే పాల్గొని ఉండవచ్చు. ఈ దాడికి పాల్పడిన హంతకులు పాకిస్తాన్ నుంచి వచ్చారని నిరూపించే ఆధారాలు ఎక్కడ. అవి కేంద్రం, ఇంటెలిజెన్స్ వద్ద ఉన్నాయా?. ఉగ్రవాదుల్ని గుర్తించారా? వారు ఎక్కడ నుంచి వచ్చారు? నా ఉద్దేశ్యం ప్రకారం వారు స్వదేశీ ఉగ్రవాదులు కావచ్చు. వారు పాకిస్తాన్ నుంచి వచ్చారని మీరు ఎందుకు అనుకుంటున్నారు? దానికి ఆధారాలు లేదు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఎన్ఐఏ విచారణను ప్రభుత్వం వెల్లడించడానికి ఇష్టపడటం లేదు' అంటూ వ్యాఖ్యలు చేశారు.ఇదే సమయంలో ఆపరేషన్ సిందూర్‌లో ప్రభుత్వం నష్టాలను దాచిపెట్టిందని చిదంబరం ఆరోపించారు. రెండో ప్రపంచ యుద్ధంలో బ్రిటన్ ఎన్ని నష్టాలను చవిచూసినా, దానిని స్పష్టంగా చెప్పిందని, యుద్ధంలో నష్టాలు అనివార్యమైనవని, ప్రభుత్వం నష్టాలను అంగీకరించాలని ఆయన చెప్పుకొచ్చారు. దీంతో, వ్యాఖ్యలకు బీజేపీ నేతలు కౌంటర్ ఇస్తున్నారు.చిదంబరం వ్యాఖ్యలకు తాజాగా బీజేపీ నేత అమిత్ మాలవీయా ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. యూపీఏ హయాంలో హోంమంత్రిగా పనిచేసిన చిదంబరం అపఖ్యాతి పాలైన 'కాషాయ ఉగ్రవాదం' సిద్ధాంతానికి మూల ప్రతిపాదకుడు. మరోసారి తనను తాను కీర్తించుకున్నారు. ఇప్పుడు పాకిస్తాన్‌కి క్లీన్ చిట్ ఇవ్వడానికి కాంగ్రెస్ తొందరపడుతోంది. కాంగ్రెస్ నాయకులకు భారతదేశ ప్రతిపక్షం కన్నా ఇస్లామాబాద్ రక్షణ కోసం ఎందుకు మాట్లాడుతున్నారు? అని ప్రశ్నించారు. బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో చర్చకు ముందే కాంగ్రెస్ పాకిస్తాన్‌కు క్లీన్ చిట్ ఇచ్చిందని ఘాటు విమర్శలు చేశారు.ఈ నేపథ్యంలో బీజేపీ నేతల వ్యాఖ్యలకు కాంగ్రెస్ ఇమ్రాన్ మసూద్ స్పందిస్తూ.. చిదంబరం వ్యాఖ్యలు సరైనవే. పహల్గాం దాడి ఘటనలో స్వదేశీ ఉగ్రవాదులే పాల్గొన్నారు. సరే.. బీజేపీ నేతలు చెబుతున్నట్టు పాకిస్తాన్ ఉగ్రవాదులే ఈ దాడి చేస్తే.. మన సరిహద్దు ప్రాంతం భద్రత ప్రశ్నార్థకంగా ఉందా?. సరిహద్దులు భద్రంగా లేవా?. నిజంగా వారు సరిహద్దులు దాటి వస్తే.. సెక్యూరిటీ ఏం చేస్తోంది?. వారు ఎక్కడి నుంచి వచ్చారు.. ఎలా వెళ్లిపోయారు?. ఈ విషయం తెలుసుకునే హక్కు మాతో పాటు.. దేశ ప్రజలకు కూడా ఉంది అని అన్నారు.

## కేటీఆర్ వ్యాఖ్యలు బూమరాంగ్ అయ్యాయా ?

హైదరాబాద్,బీఆర్ఎస్ కి భవిష్యత్తు నాయకుడిగా కేటీఆర్ ఉన్నారు. అయితే కేసీఆర్ తరువాత అంతటి వ్యూహ రచనా చాతుర్యం ఆయనలో ఉందా అన్న సందేహాలు అయితే పార్టీ లోపలా బయటా ఉన్నాయి. ఎందుకంటే కేసీఆర్ మౌనంతో ఎన్నో వ్యూహాలను రచించి ప్రత్యర్థులకు చిక్కకుండా దొరకకుండా రాజకీయంగా చెలగాటమాడేవారు అని పేరు. ఆయనను అందుకే అపర చాణక్యుడు అంటారు. ఇక కేటీఆర్ చూస్తే నాయకత్వ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి కానీ ఆయన కొన్ని సందర్భంలో ఆవేశంతో చేస్తున్న వ్యాఖ్యలే చివరికి అటూ ఇటూ తిరిగి గులాబీ పార్టీ తోటకే చిచ్చు పెడుతున్నాయని అంటున్నారు.

**సీఎం రమేష్ తో కెలుక్కుని :**

కేటీఆర్ కి కావాల్సింది సీఎం రేవంత్ రెడ్డికి గురి పెట్టడం. పైగా హెచ్.సి.యూ భూములను పదివేల కోట్లకు అమ్మేశారు అన్నది ప్రధాన ఆరోపణ. ఇది సెంటిమెంట్. ప్రభుత్వ భూములను అమ్మారు అన్నది జనంలోకి పోనీయడం ద్వారా కాంగ్రెస్ సర్కార్ ని బదనాం చేయాలన్నది ఒక వ్యూహం. అంతటితో ఆగి ఉంటే బాగుండేది. ఈ విషయంలో ఏపీకి చెందిన బీజేపీ ఎంపీ సీఎం రమేష్ సాయం తీసుకున్నారని దానికి ప్రతిగా ఆయనకు ఫోర్త్ సిటీలో 1600 కోట్ల రూపాయల పనులను సీఎం రమేష్ కు రేవంత్ రెడ్డి అప్పగించారు అని ఆరోపించారు. ఇది తీవ్ర ఆరోపణ. పైగా రిటర్న్ గిఫ్ట్ అన్నారు.

**సీన్ లోకి ఎంట్రీతోనే :**

ఇక ఈ ఆరోపణల మీద నిజంగా రియాక్ట్ కావాల్సింది కాంగ్రెస్. ఎందుకంటే హెచ్.సి.యూ భూముల మీద పెద్ద బండ వేశారు కాబట్టి. కానీ సీఎం రమేష్ ఎంట్రీ ఇచ్చారు. అంతటితో ఆగకుండా ఆయన మొత్తం ఫ్లాష్ బ్యాక్ అంతా చెప్పేశారు. ఢిల్లీకి వచ్చి తనను కలిసారు అని కవిత అరెస్టు సమయంలో ఇదంతా జరిగిందని చెప్పుకొచ్చారు. అంతే కాదు బీజేపీలో బీఆర్ఎస్ ని విలీనం చేస్తామని చెప్పారని కూడా ఆయన సంచలన ఆరోపణలే చేశారు.

**బీజేపీ సైతం అదే మాట :**

ఇక బీజేపీ కూడా ఫీల్డ్ లోకి వచ్చేసింది. సీఎం రమేష్ కేటీఆర్ మీద చేసిన ఆరోపణలు అన్నీ కరెక్ట్ అని కేంద్ర మంత్రి బండి సంజయ్ చెబుతున్నారు. ఆయన ఇంకా ముందుకెళ్ళి కేటీఆర్ మొదటి సారి పోటీ చేసినపుడు సిరిసిల్లాలో ఆయన గెలుపునకు సీఎం రమేష్ ఆర్థికంగా సాయం చేశారు అని మరో విషయం చెప్పారు. దీంతో ఇపుడు కేటీఆర్ వ్యాఖ్యల సంగతేమో కానీ బీఆర్ ఎస్ ఇరుకున



పడినట్లు అయింది అని అంటున్నారు.

**కొసరు విషయమే హైలెట్ :**

ఇక హెచ్.సి.యూ భూముల వ్యవహారంతో రాజకీయ రాధాంతం జరుగుతుందని అది కాంగ్రెస్ ని ఇబ్బంది పెడితే సెంటిమెంట్ వర్కౌట్ అవుతుందని బీఆర్ఎస్ వేసుకున్న అంచనాలు వేరేగా అయ్యాయి. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం ఇపుడు తెలంగాణా రాజకీయాల్లో హైలెట్ అవుతోంది. నిజంగా అలా జరిగిందా అలా అని ఉంటారా అన్నదే ఇపుడు హాట్ టాపిక్. దాంతో ఈ కామెంట్స్ మీద జవాబు చెప్పలేక బీఆర్ఎస్ సతమతమవుతోంది. ఎప్పటికీ బీజేపీలో బీఆర్ ఎస్ విలీనం కానే కాదు అని గులాబీ నేతలు అంటున్నా విషయం మాత్రం జనాల్లోకి వెళ్ళిపోయింది.

**బీఆర్ఎస్ కి బిగ్ ట్రబులేనా :**

బీజేపీ చూస్తే జాతీయ పార్టీ. పైగా తెలంగాణాలో ఆ పార్టీ మూడవ స్థానంలో ఉంది. విలీనం వార్తల వల్ల నష్టం ఎక్కువగా జరిగేది బీఆర్ఎస్ కే అని అంటున్నారు. బీఆర్ఎస్ కి మైనారిటీలు సహా అన్ని వర్గాల మద్దతు అవసరం. దాంతో ఈ రకమంగా జనంలోకి వెళ్తే కాదు అని పెద్ద గొంతుతో ఎంతగా చెప్పినా అనుమానాలు అయితే వెళ్తాయని అని అంటున్నారు. మొత్తానికి సీఎం రమేష్ ని మధ్యలోకి తేవడం కాదు కానీ కేటీఆర్ అనుకున్నది ఒకటి జరిగింది మరోటి అయిందని అంటున్నారు. టోటల్ గా కాంగ్రెస్ ఈ ఇష్యూలో సేఫ్ జోన్ లో ఉంటే బీఆర్ఎస్ కార్నర్ అయిందని మొత్తం బూమరాంగ్ అయిందని అంటున్నారు.

## రేవ్ పార్టీలో ప్రాంజల్ ఖేవాల్కర్.. మహారాష్ట్ర రాజకీయాల్లో కలకలం



పూణే: మహారాష్ట్రలోని పూణేలో తాజాగా క్రైమ్ బ్రాంచ్ పోలీసులు రేవ్ పార్టీని భగ్నం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో నలుగురు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. వీరిలో మహారాష్ట్ర సీనియర్ నేత ఏక్‌నాథ్ ఖడ్సే అల్లుడు డాక్టర్ ప్రాంజల్ ఖేవాల్కర్ కూడా ఉండటం విశేషం. వీరంతా పార్టీలో కొకైన్, గంజాయి సేవించారని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ ఘటన మరోమారు మహారాష్ట్ర రాజకీయాలను వేడెక్కించింది.డాక్టర్ ప్రాంజల్ ఖేవాల్కర్, ప్రముఖ రాజకీయ నేత ఏక్‌నాథ్ ఖడ్సే కుమార్తె, జాతీయవాద మహిళా రాష్ట్ర విభాగం అధ్యక్షురాలు రోహిణి ఖడ్సేను వివాహం చేసుకున్నారు. రాజకీయాల్లో చురుగ్గా వ్యవహరించే రోహిణి.. ప్రాంజల్‌ను రెండో వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం ఈ జంట ముక్తాయ్‌నగర్‌లో ఉంటోంది. రియల్ ఎస్టేట్, ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లను నిర్వహిస్తున్న వ్యాపారవేత్తగా ప్రాంజల్ ఖేవాల్కర్ పేరొందారు. చక్కెర, ఇంధన రంగాలకు సంబంధించిన కంపెనీలను నిర్వహిస్తున్నారు. ఒక ట్రావెల్ కంపెనీని కూడా నడుపుతున్నారు. అయితే ప్రాంజల్ రాజకీయాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు.రేవ్ పార్టీలో డాక్టర్ ప్రాంజల్ ఖేవాల్కర్ అరెస్టు అయిన దరిమిలా ఆయనకు సంబంధించిన మునుపటి వివాదాలు ఇప్పుడు వెలికివస్తున్నాయి. గతంలో సామాజిక కార్యకర్త అంజలి దమానియా.. ప్రాంజల్ ఖేవాల్కర్‌పై పలు ఆరోపణలు చేశారు. ఆయన మహారాష్ట్రలోని జల్గావ్ ఆర్‌టీఓలో లైట్ మోటార్ వెహికల్ (ఎల్ఎంవీ) కేటగిరీ కింద సోనాటా లిమోజిన్‌ను నమోదు చేశారని, అది చట్టవిరుద్ధమని ఆమె పేర్కొన్నారు. దేశంలో అంబాసిడర్ లిమోజిన్‌లకు మాత్రమే చట్టబద్ధంగా అనుమతి ఉందని దమానియా వాదించారు. ఆ కారును ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా తాజాగా రేవ్ పార్టీపై దాడి చేసిన పోలీసులు హడప్సర్‌లోని రోహిణి ఖడ్సే బంగ్లాను కూడా సోదా చేశారు. పార్టీలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన ప్రాంజల్ ఖేవాల్కర్‌ను సస్సూన్ ఆస్పత్రికి వైద్య పరీక్షల కోసం తీసుకెళ్లారు. కేసు దర్యాప్తులో ఉందని పోలీసులు తెలిపారు.

## మా ఆర్థిక వ్యవస్థను స్విచ్ఛాఫ్ చేసుకోవాలా..?

న్యూఢిల్లీ,ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యాపై పశ్చిమ దేశాలు పలు ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. అయితే, ఈ ఆంక్షలు ఖచ్చితంగా మాస్కో నుంచి భారత్‌కు పెద్ద ఎత్తున చమురు దిగుమతి చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో రష్యా చమురు (రష్యా ఆయిల్) దిగుమతి చేసుకోవడంపై పశ్చిమ దేశాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. తాజాగా భారత్ స్పందించింది. పశ్చిమ దేశాల విమర్శలను యూకేలోని భారత హైకమిషనర్ (భారత రాయబారి) విక్రమ్ దొరైస్వామి (విక్రమ్ దొరైస్వామి) తోసిపుచ్చారు. ఏ దేశం కూడా తమ ఆర్థిక వ్యవస్థను ఆపేయాలని అనుకోదని.బ్రిటిష్ రేడియో స్టేషన్ టైమ్స్ రేడియోతో దొరైస్వామి మాట్లాడుతూ.. భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారు అని తెలిపారు. దేశ అవసరాల్లో 80 శాతం దిగుమతులపైనే అధారపడుతున్నట్లు చెప్పారు. రష్యా నుంచి చౌక ధరకు చమురు దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిపారు. అవసరాల మేరకు డిస్కౌంట్‌పై చమురును ఎలా కొనుగోలు చేయకుండా ఉంటాం..? అని ప్రశ్నించారు. పశ్చిమ దేశాలు భారత్‌పై



విమర్శలు చేస్తున్నాయి. 'వేం ఏం చేయాలో పశ్చిమ దేశాలు కోరుకుంటున్నాయి..? మా ఆర్థిక వ్యవస్థను స్విచ్ఛాఫ్ చేసుకోవాలా..?' అంటూ ప్రశ్నించారు.

## కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్..పహల్గామ్ ఉగ్రవాదుల హతం



శ్రీనగర్,జూలై28: జమ్మూ కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరగింది. రెండు నెలల క్రితం పహల్గామ్ ఉగ్రదాడికి పాల్పడ్డ నలుగురిలో ముగ్గురిని భద్రతా బలగాలే ఎన్‌కౌంటర్ చేశాయి. అమాయకుమైన 26 మంది టూరిస్టుల్ని పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ, లష్కరే తోయిబా అనుబంధ సంస్థ అయిన 'ది రెస్టిస్టెంట్ ఫ్రంట్(టీఆర్ఎఫ్)' ఉగ్రవాదులు చంపేశారు. ప్రకృతి అందాలను చూడటానికి వచ్చిన పర్యాటకుల్ని మతం పేరు అడుగుతూ చంపేశారు. ఈ ఘటన తర్వాత సంఘటనా స్థలం నుంచి పారిపోయారు. అయితే, ఈ ఘటనకు పాల్పడిన ముగ్గురు పాకిస్తాన్ అనుమానిత ఉగ్రవాదుల్ని జమ్మూ కాశ్మీర్‌లో సైన్యం చుట్టుముట్టినట్లు తెలుస్తోంది. ఈ ఉగ్రవాదులు సైన్యం జరుపుతున్న ఎన్‌కౌంటర్‌లో చిక్కుకున్నట్లు- సంబంధిత వర్గాలు చెప్పాయి. హిర్వాన్ - లిద్వాస్ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరుగుతోంది. గత 2 నెలలుగా ఈ ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు జమ్మూ కాశ్మీర్ వ్యాప్తంగా విస్తృతంగా సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. 'ఆపరేషన్ మహదేవ్' పేరుతో భద్రతా బలగాలు ఉగ్రవాదుల కోసం వేట మొదలుపెట్టి, ఉగ్రవాదుల్ని హతం చేశారు. భారత సైన్యం, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్పీఎఫ్), జమ్మూ కాశ్మీర్ పోలీసులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించాయి. నివేదికల ప్రకారం, ఈ ముగ్గురు ఉగ్రవాదుల్ని భద్రతా బలగాలు మట్టు-పెట్టినట్లు- తెలుస్తోంది. అయితే, ఈ విషయం అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. శ్రీనగర్‌లోని దాచిగమ్ నేషనల్ పార్క్ సమీపంలో భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య ఎదురుకాల్పులు కొనసాగాయి. కనీసం ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా దళాలు చుట్టుముట్టాయి. వీరు పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదులని తెలుస్తోంది.హర్వాన్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కినట్లు- నిఘా వర్గాల సమాచారంతో నెల రోజుల నుంచి గాలింపు చేపట్టారు. చివరకు సోమవారం ఉదయం దాచిగమ్ అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపడుతుండగా.. భద్రతా దళాలపైకి ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీంతో భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు జరిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో గల ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బైసరన్ లోయ వద్ద ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. అతి సమీపం నుంచి కాల్పులు జరిపి 25 మంది పర్యాటకులు, ఓ కశ్మీరీ వ్యక్తి ప్రాణాలు తీశారు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యారు. అప్పటి నుంచి భద్రతా దళాలు ఉగ్రవాదుల కోసం ముమ్మర వేట సాగిస్తున్నాయి. లష్కరే తయిబా అనుబంధ సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్'కు చెందిన ఉగ్రవాదులు ఈ దాడికి పాల్పడినట్లు- ప్రాథమికంగా నిర్ధరించారు.

## అప్పుడు భారత్-పాకిస్తాన్, ఇప్పుడు థాయిలాండ్-కంబోడియా..



వాషింగ్టన్,అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి భారత్-పాకిస్తాన్ విషయాన్ని ప్రస్తావించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో తానే ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ చేసేలా ఒప్పించానని చెప్పాడు.ఇప్పటికే ఈ విషయాన్ని 20 కన్నా ఎక్కువ సార్లు ట్రంప్ చెప్పాడు. మరోవైపు, ట్రంప్ వ్యాఖ్యలపై భారతదేశంలో రాజకీయ యుద్ధం ప్రారంభమైంది. ప్రధాని మోడీ ట్రంప్‌కు లొంగిపోయాడని కాంగ్రెస్ విమర్శిస్తోంది. ఇలా ఉంటే, పాకిస్తాన్ డీజీఎంఓ, భారత డీజీఎంఓకి కాల్ చేసి, కాల్పుల విరమణను కోరడంతోనే సాధ్యమైందని, ట్రంప్ మాటల్లో నిజం లేదని భారత ప్రభుత్వం పలుమార్లు చెప్పింది.ఇదిలా ఉంటే, తాగా ఆయన థాయిలాండ్-కంబోడియా యుద్ధాన్ని కూడా ఆపినట్లు చెప్పారు. ఇరు దేశాలు శత్రుత్వాన్ని నిలిపేయాలని, వాణిజ్య ఒప్పందాలను నిలిపేస్తానని హెచ్చరించినట్లు ఆయన పేర్కొన్నారు. "నేను భారత్-పాకిస్తాన్ మధ్య సంఘర్షణను నిరోధించాను, ఇప్పుడు థాయిలాండ్-కంబోడియా యుద్ధాన్ని ముగించాను" అని అన్నారు.థాయిలాండ్, కంబోడియాలతో అమెరికా చాలా వాణిజ్యం చేస్తుందని ట్రంప్ చెప్పారు. తాను ఇరు దేశాల ప్రధాన మంత్రులకు ఫోన్ చేసి, వారు యుద్ధాన్ని ముగించకుంటే ఎలాంటి వాణిజ్య ఒప్పందం ముందుకు సాగదని హెచ్చరించినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే, కాల్పుల విరమణ ఒప్పందం జరిగినప్పటికీ.. థాయిలాండ్ తమపై దాడులు చేస్తోందని కండోడియా ఆరోపించింది.

## సంపాదకీయం

మంగళవారం 29-07-2025

# ఆగని జాత్యహంకార బీభత్సం

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో జాతులు, తెగలు, కులాలు, మతాల మధ్య రానురాను వివక్ష, విద్వేషాలు పెచ్చుపెరిగిపోతున్నాయి. ఈ బీభత్సకాండకు గత శతాబ్ద కాలంలో ప్రపంచ వ్యాప్తంగా 6.20 కోట్ల మంది ప్రాణాలు కోల్పోయారని నివేదికలు చెబుతున్నాయి. ఈ విద్వేషం, జాత్యహంకారంపై వరల్డ్ వాల్యూ సర్వే పేరుతో మూడు దశాబ్దాలపాటు 80 దేశాల్లో అధ్యయనం నిర్వహించారు. ఈ దేశాల జాబితాలో అగ్రస్థానంలో జోర్డాన్ ఉండగా, రెండోస్థానంలో భారత్ ఉందని తేలింది. అయితే ఇటీవల ఆస్ట్రేలియాలో జాత్యహంకార సంఘటన సంచలనం కలిగించిన సంగతి తెలిసిందే. ఈనెల 19న మెల్‌బోర్న్‌లోని ఎసెండన్‌లో 29ఏళ్ల భారతీయ యువకుడు జన్‌ప్రీతిసింగ్ భార్యతో కలిసి ఓ డిన్నర్ పార్టీకి వెళ్లి ఇంటికి చేరుకున్నాక, కారు పార్కింగ్ చేస్తుండగా, నలుగురు దుండగులు దాడికి పాల్పడి, ఒంటిపై పెట్రోలు పోసి నిప్పంటించారు. ఈ నెల రెండో తేదీన ఆస్ట్రేలియాలోనే భారతీయ విద్యార్థి నితిన్ గార్గ్ హత్య సంఘటన మరువక ముందే ఈదాడి జరగడంతో అక్కడి భారతీయులు ఆందోళన చెందుతున్నారు. నితిన్ హత్యను ఆస్ట్రేలియా ప్రభుత్వం కూడా ఖండించింది. మెల్‌బోర్న్‌లోని బొరోనియాలో ఓ హిందూ ఆలయంపై గుర్తు తెలియని వ్యక్తులు విద్వేషపూరిత వ్యాఖ్యలు రాశారు. అదే ప్రాంతంలోని ఆసియన్లు నడిపే హోటళ్లపై కూడా ఇలాంటి విద్వేషపూరిత రాతలే (%ఝ్వటబశ్రీ షతీఱఅస్త్రం%) రాసినట్టు స్థానిక మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. గత ఏడాది జూన్‌లో ఆస్ట్రేలియాలో సుమారు 30 మంది భారతీయులపై దాడులు జరిగాయి. వీటిలో ఎక్కువ శాతం జాతివివక్షకు సంబంధించినవే. జాత్యహంకారంలో అమెరికా కూడా ఏం తక్కువ కాదు. అమెరికాలో నల్లజాతి హక్కుల కోసం పోరాడి 1968లో ఒక జాత్యహంకారి తూటాలకు మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ బలైన విషాద సంఘటన ప్రపంచాన్నే కుదిపివేసింది. ఆ హత్యకు సంబంధించిన సుమారు 2.4 లక్షల పేజీల సమాచారాన్ని అమెరికా ప్రభుత్వం ఇటీవల బహిరంగ పర్చడం ప్రశంసనీయమే అయినా, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పాలనలో జాతి విద్వేషం మాసిపోలేదు. గూఢచర్యానికి పాల్పడుతున్నారని, అమెరికా దేశ మేధోసంపత్తిని కాజేసి చైనాకు అందజేస్తున్నారని నిరాధార ఆరోపణలతో వెయ్యిమందికి పైగా చైనా విద్యార్థుల వీసాలను ట్రంప్ రద్దు చేయడం తెలిసిందే. అలాగే గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి భారీ టెక్ కంపెనీలు ఇక నుంచి భారతీయులను నియమించుకోకూడదని, అమెరికన్లకే ప్రాధాన్యం ఇవ్వాలని హెచ్చరించడం జాత్యహంకారానికి ఒక ఉదాహరణ కాదా! అమెరికాలోని చాలా భారీ టెక్ కంపెనీలు చైనాలో కంపెనీలు నిర్మిస్తూ భారతీయ ఉద్యోగులను నియమించుకుంటున్నారని, ఐర్లాండ్‌ను అడ్డంపెట్టుకుని తక్కువ లాభాలు చూపిస్తూ స్వేచ్ఛను అనుభవిస్తున్నాయని కూడా ట్రంప్ తన విద్వేషాన్ని వెళ్లగక్కుతున్నారు. న్యూజెర్సీలోని ఎడిసన్ మేయర్ పదవికి పోటీ పడుతున్న భారత సంతతి అభ్యర్థులు జాతి విద్వేషాన్ని చవిచూశారు. ప్రచారం కోసం ఏర్పాటు చేసిన సైన్‌బోర్డులపై కొందరు దుండగులు స్వస్తిక్ గుర్తుతోపాటు నెవర్ ఇన్ ఎడిసన్ అంటూ విద్వేషపూరిత రాతలు రాశారు. ఇక మన భారతదేశం పరిస్థితి పరిశీలిస్తే జాత్యహంకారం, విద్వేష సంఘటనలకు కొదువ లేదు. దీనికి ఇప్పటికీ రావణ కాష్టంలా రగులుతున్న మణిపూర్ హింసాకాండే ఉదాహరణ. మైనారిటీ కుకీలకు, మెజార్టీ మెయితీలకు మధ్య గత రెండేళ్లుగా విద్వేషాలు భగ్గుమంటున్నా కేంద్రం చూసీచూడనట్టు వ్యవహరించడం శోచనీయం. దేశంలో ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట దళితులపై దౌర్జన్యాలు, అత్యాచారాలు జరగడం మామూలైపోయింది. జాతీయ దళిత ఉద్యమం, దళిత మానవ హక్కుల జాతీయ ప్రచార ఉద్యమం ఉమ్మడిగా నిర్వహించిన సర్వేలో 2009 2018 మధ్యకాలంలో దేశంలో దళితులపై అమానుష సంఘటనలు 6% పెరిగాయని వెల్లడైంది. 2019 ఏప్రిల్‌లో ఉత్తరాఖండ్‌లో కుర్చీలో కూర్చుని వివాహ భోజనం చేసిన 21ఏళ్ల దళిత వ్యక్తిని అగ్రవర్ణస్థులు చితకబాదారు. అదే ఏడాది సెప్టెంబర్‌లో ఉత్తరప్రదేశ్ హత్రాస్ జిల్లా లోని బూల్గరీ గ్రామంలో 20 ఏళ్ల దళిత మహిళను నలుగురు అగ్రవర్ణస్తులు సామూహిక అత్యాచారం చేసి చంపేశారు. 2020 లోనే దేశ రాజధాని ఢిల్లీలో తొమ్మిదేళ్ల దళిత బాలికపై హత్యాచారం చేసి కుటుంబానికి తెలియకుండానే దహనక్రియ జరిపించే దారుణం ఎవరూ మర్చిపోరు. దేశంలో ప్రతి 18 నిమిషాలకు ఒకసారి దళితులపై దౌర్జన్యకాండ సాగుతున్నదని అంచనా. 2009 18 లో దళితులపై అత్యాచారాల నిరోధ చట్టం కింద నమోదైన కేసుల్లో సగటున 88.5 శాతం కేసులు అపరిష్కృతంగానే ఉన్నాయని నివేదికలు చెబుతున్నాయి. ఇక అన్యమతాలవారిపై ఏదో ఒకసాకుతో దాడులు జరుగుతుండడం పరిపాటి అయింది. మహారాష్ట్రలో ఇటీవల పశువులను అక్రమంగా రవాణా చేస్తున్నారన్న సాకుతో గోరక్షకులు హింసాకాండ సాగిస్తున్నారని నిరసిస్తూ పశువుల వ్యాపారం చేస్తున్న ముస్లిం వర్గాలు ఆందోళనకు దిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జాతి వివక్ష, విద్వేషాల దేశాల జాబితాలో మనదేశం జోర్డాన్ తరువాత రెండోస్థానంలో ఉందని నివేదికలో తేలడంపై ఆశ్చర్యపోనవసరం లేదు. జోర్డాన్‌లో 51.4 శాతం మంది వేరే జాతి ప్రజల పొరుగున నివసించడానికి విముఖత వ్యక్తం చేయగా, భారత దేశంలో 43.5% మంది వేరే జాతివారిని తమ పొరుగువారిగా అంగీకరించడానికి ఇష్టపడడం లేదు. మన దేశంతో పోల్చుకుంటే ఈజిప్టు, సౌదీ అరేబియా, ఇరాన్, వియత్నాం, ఇండోనేసియా, దక్షిణ కొరియా దేశాల్లో 30 నుంచి 39.9% వరకే జాతి వివక్ష కనిపిస్తోందని వరల్డ్ వాల్యూ సర్వే వెల్లడించడం గమనార్హం.

# అధఃపతనానికి అమెరికా ప్రతిష్ఠ



అమెరికా,డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా అధికారం చేపట్టినప్పటి నుండి అమెరికా- భారత్ సంబంధాలు గణనీయమైన క్షీణతను చవిచూస్తున్నాయి. అమెరికాను తిరిగి గొప్పదేశంగా మార్చాలనే ట్రంప్ లక్ష్యం దేశభక్తితో కూడిన ఆలోచనగా కనిపించినప్పటికీ, ఆయన అనుసరిస్తున్న విధానాలు, హఠాత్తు నిర్ణయాలు, అనాగరిక భాష, ప్రవర్తన అమెరికా ప్రతిష్ఠను, అంతర్జాతీయ సంబంధాలను దెబ్బతీస్తున్నాయి. భారతీయులే లక్ష్యంగా ట్రంప్ విధానాలు భారతీయ వలసదారులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి టెక్ దిగ్గజాలలో భారతీయుల నియామకాలను నిషేధించాలని ఆయన చేసిన పిలుపు, భారతదేశంతో సంబంధాలను దెబ్బతీసేలా ఉంది. ఈ వైఖరి కేవలం ఆర్థిక సంబంధాలను మాత్రమే కాకుండా, దీర్ఘకాలిక సాంస్కృతిక, సామాజిక బంధాలను కూడా దెబ్బతీస్తోంది. భారతీయ వలసదారులు అమెరికా ఆర్థిక వ్యవస్థకు, ముఖ్యంగా సాంకేతిక రంగంలో గణనీయమైన కృషి చేశారు. సుందర్ పిచాయ్ (గూగుల్ సిఇఒ), సత్యానాదెళ్ల (మైక్రోసాఫ్ట్ సిఇఒ) వంటి భారతీయ కంప్యూటర్ సైన్స్, సాంకేతిక నిపుణులు అమెరికా టెక్ రంగంలో విశిష్ట స్థానాన్ని సంపాదించారు. ట్రంప్ ఈ హెచ్చరికలు వారి సహకారాన్ని అవమానించడమే కాకుండా, అమెరికా బహు సాంస్కృతిక స్ఫూర్తిని కూడా దెబ్బతీస్తున్నాయి. అమెరికా మీడియాలో కూడా ఈ నిర్ణయాలపై విమర్శలు వెల్లువెత్తాయి. 'న్యూయార్క్ టైమ్స్' వంటి పత్రికలు ట్రంప్ వలస విధానాలను 'ఆర్థిక స్వయం విధ్వంసం'గా అభివర్ణించాయి. ఎందుకంటే భారతీయ టెక్ నిపుణులు అమెరికా ఆర్థిక వ్యవస్థకు బిలియన్ల డాలర్ల విలువైన సహకారం అందిస్తున్నారు. అదే సమయంలో, భారతీయ మీడియా సంస్థలు, 'ది హిందూ', 'ఇండియా టుడే' వంటివి, ట్రంప్ వైఖరిని 'వివక్షపూరితం' అని ఖండించాయి. ఇది భారతీయ సమాజంలో తీవ్రమైన అసంతృప్తిని రేకెత్తించింది. ట్రంప్ విదేశీ విధానాలు కేవలం భారతదేశంతోనే కాకుండా ఇతర దేశాలతో సంబంధాలను కూడా దెబ్బతీస్తున్నాయి. ట్రంప్ ఇజ్రాయెల్, అలాగే ఉక్రెయిన్‌కు సైనిక, ఆర్థిక సహాయం అందించడం, యుద్ధాలను ప్రోత్సహించడం వంటి చర్యలు అంతర్జాతీయ సమాజంలో అమెరికా నైతిక స్థానాన్ని దిగజార్చాయి. 'గార్డియన్' (యుకె), 'లే మాండే' (ఫ్రాన్స్) వంటి అంతర్జాతీయ మీడియా సంస్థలు ట్రంప్ నిర్ణయాలను 'ప్రపంచ శాంతికి ముప్పు' గా అభివర్ణించాయి. ఈ విధానాలు అమెరికాను ఒంటరిగా నిలబెట్టే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. భారతదేశంతో సంబంధాలలో, ట్రంప్ వ్యక్తిగత విమర్శలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో స్నేహపూర్వక సంబంధాలను కూడా దెబ్బతీశాయి. ఒకప్పుడు 'మోడీ నా మంచి మిత్రుడు' అని ప్రకటించిన ట్రంప్, ఇప్పుడు భారతదేశంపై విమర్శలు గుప్పించడం, వాణిజ్య ఒప్పందాలలో అసమంజసమైన షరతులు విధించడం వంటి చర్యలతో ద్వైపాక్షిక సంబంధాలను కూడా దెబ్బతీస్తున్నాడు. భారతదేశం 'మేక్ ఇన్ ఇండియా' వంటి కార్యక్రమాలు అమెరికా సహకారంతో మరింత బలపడవచ్చునని భారతీయ విశ్లేషకులు భావించినప్పటికీ ట్రంప్ ఏకపక్ష నిర్ణయాలు ఈ అవకాశాలను అడ్డుకుంటున్నాయి. ట్రంప్ నిర్ణయాలకు వ్యతిరేకంగా అమెరికాలోనూ, అంతర్జాతీయంగా పెద్ద ఎత్తున నిరసన ర్యాలీలు జరిగాయి. అమెరికాలో, న్యూయార్క్, కాలిఫోర్నియా వంటి నగరాల్లో భారతీయ వలసదారులు, స్థానిక అమెరికన్లు ట్రంప్ వలస విధానాలకు వ్యతిరేకంగా ర్యాలీలు నిర్వహించారు. ప్లకార్డులతో నినాదాలతో హోరెత్తించారు. భారతదేశంలో న్యూఢిల్లీ, బెంగళూరు వంటి నగరాల్లో ట్రంప్ వైఖరిని ఖండిస్తూ నిరసన దీక్షలు జరిగాయి. ఈ నిరసనలు ట్రంప్ విధానాలు కేవలం ఆర్థిక సమస్యలను మాత్రమే కాకుండా మానవీయ విలువలను కూడా దెబ్బతీస్తున్నాయని స్పష్టం చేశాయి. అంతర్జాతీయంగా, యూరోపియన్ యూనియన్, కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాల పౌరులు కూడా ట్రంప్ విదేశీ విధానాలను వ్యతిరేకించారు. లండన్‌లో జరిగిన ఒక భారీ నిరసన ర్యాలీలో ట్రంప్ యుద్ధ ప్రోత్సాహక విధానాలను 'ప్రపంచ శాంతికి ముప్పు' గా అభివర్ణించారు. ఈ నిరసనలు ట్రంప్ అనాలోచిత నిర్ణయాలు అమెరికాను అంతర్జాతీయంగా ఒంటరిగా నిలబెట్టే ప్రమాదాన్ని సూచిస్తున్నాయి. ట్రంప్ విధానాలు, ముఖ్యంగా ఇజ్రాయెల్, ఉక్రెయిన్‌లో యుద్ధాలకు సహకారం, ప్రపంచశాంతికి విరుద్ధంగా ఉన్నాయి. అటువంటి నాయకుడికి నోబెల్ శాంతి బహుమతి లభిస్తే అది ఆ బహుమతి గౌరవాన్ని దిగజార్చడమే అవుతుంది. ప్రపంచ ప్రజలు నవ్విపోతారు. అంతర్జాతీయ విశ్లేషకులు, 'ట్రంప్ చర్యలు శాంతిని ప్రోత్సహించడం కాదు, సంఘర్షణలను రెచ్చగొట్టడం' అని స్పష్టం చేశారు. ట్రంప్ ఇజ్రాయెల్- పాలస్తీనా విధానం మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలను మరింత పెంచింది. ఈ నేపథ్యంలో, నోబెల్ శాంతి బహుమతి నిర్వాహకులు ట్రంప్‌ను పరిగణనలోకి తీసుకుంటే, అది ప్రపంచవ్యాప్తంగా నిందలను ఆహ్వానించడమే అవుతుంది. 'నోబుల్ శాంతి బహుమతి' ప్రతిష్ఠ దిగజారుతుంది. ట్రంప్ అనాలోచిత నిర్ణయాలు అమెరికా ప్రతిష్ఠను దెబ్బతీస్తాయి. అంతర్జాతీయ సంబంధాలలో 'ఏకాకి' అవుతుంది. ఆర్థిక సంక్షోభం, సామాజిక అసమానతలు అమెరికా పౌరులకు దీర్ఘకాలిక నష్టాన్ని కలిగిస్తాయి. భారతదేశంతో సంబంధాల దెబ్బతినడం వల్ల, అమెరికా టెక్ రంగంలో నైపుణ్యం కలిగిన నిపుణుల కొరతను ఎదుర్కొనే ప్రమాదం ఉంది. అదే సమయంలో భారతదేశం వంటి దేశాలు చైనా, రష్యా వంటి ఇతర శక్తులతో సంబంధాలను బలోపేతం చేసుకోవచ్చు. ఇది అమెరికా భౌగోళిక - రాజకీయ ప్రభావాన్ని బలహీనపరుస్తుంది. ట్రంప్ అనాగరిక భాష అతని మానసిక, బాహ్య ప్రవర్తన, హఠాత్తు నిర్ణయాలు, వివాదాస్పద విధానాలు అమెరికాను అంతర్జాతీయంగా ఒంటరిగా నిలబెట్టే ప్రమాదం ఉంది. భారతదేశంతో సంబంధాల దెబ్బతినడం, వలసదారులపై వివక్ష, యుద్ధ ప్రోత్సాహక విధానాలు అమెరికా నైతిక, ఆర్థిక స్థానాన్ని దిగజార్చాయి. ప్రపంచ దేశాల ప్రజలు, మీడియా, నిరసనకారులు ట్రంప్ వైఖరిని ఖండిస్తున్నారు. ఈ పరిస్థితిలో ట్రంప్ తన విధానాలను సమీక్షించుకోవాలి లేకపోతే అమెరికా దీర్ఘకాలిక నష్టాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రపంచ శాంతి, సహకారం, బహుసాంస్కృతిక సమాజాన్ని ప్రోత్సహించే నాయకత్వం అవసరం. ట్రంప్ విభజనకర విధానాలు కాదు.

# అరకోటి మంది ఓటర్లెక్కడ?

బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరిట కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా నవీకరణ సుప్రీంకోర్టులో విచారణ దశలోనే వున్నా, పార్లమెంటులో అలజడి రేగుతున్నాఆ ప్రక్రియ తన దోవన తాను ముందుకెళుతున్నది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ గురువారం ఆ వ్యవహారం గురించి వెల్లడించిన వివరాల ప్రకారం, లక్షమందికి పైగా ఓటర్ల ఆచూకీ లేదు. 21.6 లక్షల మంది మరణించారు. మరో 31.5 లక్షల మంది శాశ్వతంగా వేరే చోటుకు వలసపోయారు. పోలింగ్ కేంద్రం స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) అడుగుతున్నా, మరో ఏడు లక్షల మంది ఇంతవరకూ తమ పత్రాలు దాఖలు చేయలేదు. తాము ఫలానా చోట ఉంటు న్నామని రుజువులు చూపక పోయినా, బతికే ఉన్నామని చెప్పకపోయినా లేదా తగిన పత్రాలుఅందజేయక పోయినా ఈ 61 లక్షల మంది ఓటర్లు జాబితా నుంచి శాశ్వతంగా కనుమరుగవుతారు. రాష్ట్ర ఓటర్లలో వీరు 7.7 శాతం. శుక్రవారం సాయంత్రంతో వీరందరికీ గడువు ముగిసిపోయింది. సవరించిన ఓటర్ల జాబితా ఆగస్టు 1న విడుదలవుతుంది. అయితే సెప్టెంబర్ 1లోగా ఎవరైనా జాబితాలో తమ పేరు లేదని ఫిర్యాదు చేస్తే పరిశీలించి, తగిన పత్రాలున్న పక్షంలో వారిని చేర్చి తుది జాబితా విడుదల చేస్తారు. నకిలీ లేదా విదేశీయులుగా గుర్తించిన వారిని తొలగించటం కోసం ప్రారంభించిన ఈ ప్రక్రియ దేశ చరిత్రలోనే మొట్టమొదటిది. 'పరిశుద్ధమైన' ఓటర్ల జాబితా రూప కల్పనే తమ లక్ష్యమని జ్ఞానేశ్ చెబుతున్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ స్వచ్ఛతా కార్యక్రమాన్ని స్వాగతించాల్సిందే. ఎందుకంటే ప్రజాస్వామ్య వ్యవస్థ సక్రమంగా నడవాలంటే మెజారిటీ ఆమోదం పొందిన ప్రభుత్వాలు ఏర్పడాలి. ప్రజల ఆదరణ ఉన్నవారే పాలకులు కావాలి. నకిలీ ఓటర్లు లేదా ఈ దేశ పౌరులు కానివారు ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే స్థితి ఉంటే ఆ ఎన్నికలే ప్రహసన ప్రాయమవుతాయి. ఎన్నికలు సజావుగా పూర్తవుతున్నాయన్న భావన వల్లే ఫలితాలు వెలువడ్డాక అధికార మార్పిడి శాంతియుతంగా పూర్తవుతోంది. గత దశాబ్దాలతో పోలిస్తే ఎన్నికల హింస గణనీయంగా తగ్గింది. ఇలాంటి కారణాల వల్లే విదేశాల ఎన్నికలకు మన ఈసీ అధికారులు పరిశీలకులుగా వెళ్తున్నారు. వారు సూచిస్తున్న మార్పులకు ఎంతో విలువ ఉంటున్నది. కానీ గత ఏడాది, రెండేళ్లుగా ఈసీ వ్యవహార శైలిపై విమర్శలూ, ఆరోపణలూ వెల్లువెత్తు తున్నాయి. వాటిపై అసలే స్పందించకపోవటం లేదా మరిన్ని సందేహాలు కలిగే రీతిలో జవాబీ యటం రాజకీయ పక్షాలకు ఆశ్చర్యం కలిగిస్తోంది. బిహార్ ఎన్నికల జాబితా సంగతే తీసుకుంటే సుప్రీంకోర్టు సూచించిన ఆధార్, రేషన్ కార్డు వగైరాలు పరిశీలనకు పనికి రావని అది ఎందుకు తిరస్కరించిందో అంతుపట్టదు. ఆధార్‌ను ప్రారంభించినప్పుడు నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆ కార్డే ఇకపై సర్వస్వమని, దాని ఆధారంగానే పథకాల వర్తింపు అయినా, పౌరుల గుర్తింపయినా ఉంటుందన్నారు. కానీ జరుగుతున్నది అందుకు విరుద్ధం. మరి విశ్వసనీయత లేని ఆధార్‌ను అన్నిటికీ అనుసంధానం చేయటం ఎందుకు? ఇప్పటికీ ఆ కార్డు సంపాదించటానికి సాధారణ పౌరులు తలకిందులవుతున్నారు. పుట్టిన చోటే నవజాత శిశువులకు ఆధార్ అందేలా తాజాగా కేంద్రం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అటువంటి కార్డు ఓటరు గుర్తింపునకు పనికిరాదని ఈసీ ఎలా చెబుతుందో అర్థంకాని విషయం. పౌరుల్ని గుర్తించటమనే ప్రక్రియ అన్యులకు ఆసాధ్యమని, కేవలం తామే సమర్థులమని ఆ సంస్థ చెప్పదల్చుకుంటే దాన్నెవరూ అంగీకరించరు. ఎన్నికల విశ్వసనీయతపై సందేహాలు తలెత్తటంపై ఆంధ్రప్రదేశ్ మొదలుకొని మహారాష్ట్ర, హరియాణాల వరకూ ఎన్ని ఉదాహరణలైనా చూపొచ్చు. ఏపీ సంగతే తీసుకుంటే... అక్కడ ఓటింగ్‌కు గడువు ముగిసి కేవలం ప్రాంగణంలో ఉన్న వారితో పోలింగ్ పూర్తి చేయటానికి అర్ధరాత్రి వరకూ సమయం పట్టింది. అలా వేచివున్నవారి సంఖ్య ఏకంగా 51 లక్షలు! ఇది నమ్మేలా ఉందా? ఇక పోలింగ్ శాతంపై మొదటి, చివరి ఈసీ ప్రకటనల్లోని అంకెల మధ్య 12.5 శాతం తేడావచ్చింది. ఇది గతంలో ఎప్పుడూ ఒక శాతం మించిలేదు. ఇందువల్ల సగటున ఒక్కో అసెంబ్లీ స్థానంలో అదనంగా 28,000 ఓట్లు, లోక్‌సభ స్థానంలో 1.96 లక్షల ఓట్లు అమాంతం పెరిగి పోయాయి. తటస్థ సంస్థల లెక్కల ప్రకారం ఇది 87 అసెంబ్లీ స్థానాల గెలుపోటముల్ని తారుమారు చేసింది! వేరే రాష్ట్రాల్లోనూ ఇలాంటి ధోరణే కనబడిందని అక్కడి విపక్షాలు భగ్గుమంటున్నాయిఈ సందేహాలకు సక్రమమైన జవాబు చెబితే బిహార్‌లో చేపట్టిన 'సర్'పై పెద్దగా అభ్యంతరాలు వచ్చేవి కాదేమో! కానీ ఆ సంస్థ తనకు తోచినప్పుడు మాట్లాడటం తప్ప జవాబుదారీతనాన్నీ, బాధ్యతాయుత వర్తననూ కనబరచటం లేదు. సందేహాలు పటాపంచలు చేద్దామన్న పట్టుదలను ప్రదర్శించటం లేదు. ఈసీ న్యాయబద్ధంగానే వ్యవహరిస్తున్నాననుకోవచ్చు. కానీ అలా అందరూ అనుకునేలా తన వ్యవహార శైలి వుండాలి. ప్రజాస్వామ్యంలో ఏ వ్యవస్థకైనా ఇది తప్పనిసరి. అందునా ప్రభుత్వాల తలరాతలను మార్చే కీలకమైన వ్యవస్థగా ఉన్న ఈసీకి ఇది మరింత ప్రాణప్రదం. దేశంలో ఉత్తరప్రదేశ్, బిహార్‌ల నుంచి వలసలు ఎక్కువుంటాయి. అలాంటిచోటఇంత తక్కువ వ్యవధిలో ఎక్కడెక్కడినుంచో పనులు మానుకుని వచ్చి ఓటర్లుగా నమోదు చేసు కోవటానికి అవసరమైన పత్రాలు సేకరించి సమర్పించటం బడుగు జీవులకు సాధ్యమేనా? అందుకే సర్వోన్నత న్యాయస్థానం సూచించిన ఇతర ప్రత్యామ్నాయాల గురించి కూడా ఈసీ పరిశీలించాలి. ఈ మాదిరి సవరణకు దేశవ్యాప్త ఆదరణ లభించాలంటే ఇది తప్పనిసరి.

### డిజిపి ముందు పలువురు మావోల లొంగుబాటు

విజయవాడ,పలువురు మావోయిస్టులు శనివారం ఉదయం ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఎదుట లొంగిపోయారు. వారి వివరాలను డీజీపీ మీడియాకు వివరించారు. లొంగిపోయిన వారిలో రామకృష్ణ, అరుణ ఉన్నారని పేర్కొన్నారు. ఏవోబీ పరిధిలో భారీ డంప్‌ను స్వాధీనం చేసుకున్నట్టు- డీజీపీ తెలిపారు. ఏకే 47, హ్యాండ్ గ్రనేడ్లు, ఇతర ఆయుధాలు స్వాధీనం చేసుకున్న వాటిలో ఉన్నాయన్నారు. మావోయిస్టుల కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారం అందుకుని జాయింట్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని తెలిపారు.

# రాజధాని అమరావతిపై దుష్ప్రచారాలు

అమరావతి,రాజధాని నిర్మాణంపై కొంతమంది పనిగట్టుకుని చేసే దుష్ప్రచారాలు నమ్మవద్దని మంత్రి నారాయణ అన్నారు...ప్రజలకు,అమరావతి రైతులకు ఇచ్చిన మాట ప్రకారం మూడేళ్లలో ఖచ్చితంగా నూటికి నూరు శాతం రాజధాని పనులు పూర్తిచేసి తీరుతామన్నారు. అమరావతిలో జరుగుతున్న ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులను పరిశీలించారు మంత్రి...సీఆర్డీఏ ఇంజినీర్లతో కలిసి నేలపాడులోని నాన్ గెజిటెడ్ అధికారులు,గెజిటెడ్ అధికారులు టైప్ -1,-టైప్ -2,గ్రూప్ -డి ఉద్యోగుల క్వార్టర్లను పరిశీలించారు... అక్కడ పనులు జరుగుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత నేలపాడులో మీడియాతో మంత్రిమాట్లాడారు. గత ప్రభుత్వం అమరావతిపై కక్షతో ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసింది...ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేసింది...అమరావతి విషయంలో తీసుకున్న నిర్ణయాలతో వాటిని సరిదిద్దేందుకు ఏడాది పట్టింది. టెండర్లు రద్దు చేయలేదు. కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించలేదు...న్యాయపరమైన సమస్యలు రాకుండా ఉండేందుకు కమిటీ-లు వేసి అన్నీ పరిష్కరించాల్సి వచ్చింది..ఆ తర్వాత గతంలో మధ్యలో నిలిచిపోయిన నిర్మాణాల పటిష్టత విషయంలో ఐఐటీ-చెన్నై,ఐఐటీ- హైదరాబాద్ నిపుణులతో కమిటీ-లు వేసాం...ఎట్టకేలకు అన్ని నివేదికల ఆధారంగా తిరిగి కొత్తగా టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాం...ప్రస్తుతం అమరావతిలో సుమారు పదివేల మంది కార్మికులు పనిచేస్తున్నారు...అవసరమైన యంత్రాలు కూడా ఇప్పటికే పనుల్లో ఉన్నాయి...నాన్ - గెజిటెడ్ ఆఫీసర్స్ కోసం మొత్తం 21 టవర్లలో 1995 ఫ్లాట్లు-నిర్మిస్తున్నాం...వీటిలో 9 టవర్ల నిర్మాణం పూర్తయింది...మిగతా టవర్ల నిర్మాణం డిసెంబర్ నెలాఖరుకు పూర్తవుతుంది...ఇక గెజిటెడ్ ఆఫీసర్ల కోసం మొత్తం 14 టవర్లలో 1140 ఫ్లాట్లు- నిర్మిస్తున్నాం... వీటిలో 11 టవర్ల నిర్మాణం పూర్తయింది...మరో 5 టవర్ల నిర్మాణం వేగంగా జరుగుతుంది...భవనాల నిర్మాణాలతో పాటు- రోడ్లు,తాగునీరు,డ్రైనేజి నిర్మాణాలు కూడా సమాంతరంగా జరుగుతున్నాయి..మొత్తం 4000 ఫ్లాట్ల నిర్మాణంతో ఒక టౌన్ షిప్ తయారుకానుంది..కేవలం భవనాల నిర్మాణం మాత్రమే కాకుండా ఇక్కడ నివాసం ఉండే వారికోసం అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నాం...ఎస్ ఆర్ ఎం,విట్ యూనివర్శిటీలు అమరావతిలో మెడికల్ కాలేజీలు నెలకొల్పుతున్నాయి ముందుగా ఈ రెండు యూనివర్శిటీ-లు 50 చొప్పున పడకలతో రెండు హాస్పిటల్స్ వచ్చే మార్చి నాటికి అందుబాటు-లోకి తీసుకురానున్నాయి...అలాగే ఈ రెండు యూనివర్శిటీ-లు రెండు సీబీఎస్‌ఈ స్కూల్స్ వచ్చే విద్యాసంవత్సరం నాటికి ఏర్పాటు-చేయనున్నాయి...ఇలా అమరావతి నిర్మాణం అన్ని వసతులతో పూర్తిచేస్తున్నామన్నారు మంత్రి నారాయణ. రాజధానికి భూములిచ్చిన రైతులకు తిరిగిచ్చిన ప్లాట్లలో అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభిస్తామని మంత్రి నారాయణ తెలిపారు...వర్షాల వల్ల కొంచెం ఇబ్బంది ఉందని....ఆయా పనులకు ఇప్పటికే టెండర్లు కూడా పూర్తి చేసామని అన్నారు...360 కిమీ మేర ట్రంక్ రోడ్లు,1500 కిలోమీటర్ల మేర లేఅవుట్ రోడ్లకు -టె-ండర్లు పూర్తయ్యాయి...కొండవీటి వాగు, పాలవాగు, గ్రావిటీ- కెనాల్ పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి నారాయణ అన్నారు. గత ప్రభుత్వానికి ఒక నగరం నిర్మాణం ఎలా చేయాలో అవగాహన లేదు...2014-19 మధ్య సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాం..ఆ దేశ ప్రధాని,ఇతర అధికారులతో చర్చించి కమిటీ-లు వేసి అమరావతి అభివృద్ధి కోసం ముందుకెళ్లాం...రాజధానిలో 1450 ఎకరాలు భూమిని స్విస్ ఛాలెంజ్ విధానంలో 42:58 నిష్పత్తిలో కేటాయించాం..దీనివల్ల అమరావతికి పెద్ద కంపెనీలు,బ్యాంకులు వస్తే పెద్ద ఎత్తున ఉద్యోగాలు వచ్చేవి. అయితే గత వైసీపీ ప్రభుత్వం సింగపూర్ అధికారులపై కేసులు పెట్టారు...అక్కడికి వెళ్లి మరీ వారిని వేధించారు...దీంతో సింగపూర్ ప్రభుత్వానికి ఏపీ సర్కార్ కు మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి... సింగపూర్ పర్యటనలో ఏపీ ప్రభుత్వంపై ఉన్న ముద్ర పోగొట్టు-కునేలా సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో సమావేశాలు జరుగుతాయి.

# అత్యంత విశ్వసనీయ నేతగా మోడీ

న్యూఢిల్లీ,పపంచంలో అత్యంత విశ్వసనీయ నేతగా ప్రధాని మోదీ మరోసారి టాప్‌లో నిలిచారు. మార్నింగ్ కన్సల్ట్ సంస్థ గ్లోబల్ లీడర్ సర్వేలో మరోసారి తన ఆధిక్యాన్ని నిలుపుకున్నారు. సర్వేలో ప్రధాని మోదీకి అత్యధిక శాతం మంది మద్దతు ప్రకటించడంలో అప్రూవల్ రేటింగ్స్ ఏకంగా 75 శాతానికి చేరాయి. ఈ ఏడాది జులై 4 నుంచి 10 తేదీల మధ్య సర్వేను నిర్వహించారు. ఈ సర్వేలో ప్రధాని నెం.1గా నిలవడంపై బీజేపీ సీనియర్ నేత అమిత్ మాల్వీయ సోషల్ మీడియా వేదికగా హర్షం వ్యక్తం చేశారు. భారతీయులతో పాటు-ప్రపంచవ్యాప్తంగా మిలియన్‌ల మంది ప్రజల గౌరవాభిమానాలు చూరగొన్న నేతగా ప్రధాని నిలిచారని అన్నారు. అత్యధిక అనుకూల రేటింగ్స్ కలిగిన నేతగా ఉన్నారంటూ ప్రశంసల్లో ముంచెత్తారు. బలమైన నాయకత్వం, ప్రపంచవ్యాప్తంగా గౌరవాభిమానాలు పొందే నేత సారథ్యంలో భారత్ భద్రంగా ఉందని కామెంట్ చేశారు. మార్నింగ్ కన్సల్ట్ నిర్వహిస్తున్న సర్వేల్లో మోదీ 2021 నుంచి ప్రథమ స్థానంలోనే కొనసాగుతున్నారు. సర్వేల్లో ప్రధానికి మద్దతుగా నిలుస్తున్న వారి సంఖ్య 70 శాతానికి పైగానే ఉంటోంది. 2022 సర్వేలో కూడా 13 ప్రపంచం నేతల్లో జనాదరణ పరంగా ప్రధాని టాప్‌లో నిలిచారు. ఇక 2023 నాటి సర్వేలో ఆయన అప్రూవల్ రేటింగ్స్ 76 శాతానికి ఎగబాకాయి. గతేడాది ఫిబ్రవరిలో జరిగిన సర్వేలో విశ్వసనీయత రేటింగ్స్ గరిష్ఠంగా 78 శాతాన్ని తాకాయి. ఇక తాజా సర్వేలో ప్రధాని తర్వాతి స్థానంలో దక్షిణ కొరియా నేత లీ జే మ్యూంగ్ ఉన్నారు. 59 శాతం అప్రూవల్ రేటింగ్స్‌తో రెండో స్థానంలో నిలిచారు. ఆ తరువాతి స్థానాల్లో అర్జెంటీ-నా నేత జేవియర్ మైలీ (57 శాతం), కెనడా అధినేత మార్క్ కార్నీ (56 శాతం) ఉన్నారు. ఇక ఈ జాబితాలో 44 శాతం అప్రూవల్ రేటింగ్స్‌తో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎనిమిదో స్థానంలో నిలిచారు.

### కార్గిల్ యుద్ధవీరుల సంస్మరణ

న్యూఢిల్లీ,కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ.. అమర జవాన్లకు నివాళులు అర్పించారు. నాటి యుద్ధంలో పాక్‌పై విజయం కోసం జవానులు చేసిన త్యాగాలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రధాని, రాష్ట్రపతితో పాటు- త్రివిధ దళాధిపతులు కూడా అమర జవాన్‌లకు నివాళులు అర్పించారు. మాతృభూమి కోసం ప్రాణాలు అర్పించిన వీర జవాన్‌లకు తాను నివాళులు అర్పిస్తున్నానని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఎక్స్ వేదికగా స్పందించారు. దేశ సైనికుల ధైర్యసాహసాలు, సడలని పట్టు-దలకు ఈ రోజు చిహ్నమని వ్యాఖ్యానించారు. వారి త్యాగాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ కూడా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారత మాత బిడ్డల ధైర్యసాహసాలు, త్యాగాలను ఈ రోజు గుర్తుకు తెస్తోందని అన్నారు. భారత్ సగర్వంగా తలెత్తుకునేలా జవాన్‌లు తమ జీవితాలను అంకితం చేశారని వ్యాఖ్యానించారు.

# భారత సైనిక వ్యవస్థ మరింత పటిష్టం

న్యూఢిల్లీ,పాక్‌తో యుద్ధం, చైనాతో సరిహద్దు వివాదాల నేపథ్యంలో భారత సైన్యం ఎప్పటికప్పుడు వ్యూహాలను మారుస్తూ బలోపేతం అవుతోంది. ఇటీవలి ఆపరేషన్ సిందూర్‌లో మన బలగాల సత్తా చాటాయి. అయితే దీనిని మరింత ముందుకు తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో శత్రుమూకల ఆట కట్టించేలా భారత సైన్యంలో ఓ శక్తిమంతమైన దళం ఏర్పాటైంది. భవిష్యత్తు ముప్పును ఎదుర్కొనేలా 'ఆల్ ఆర్మ్స్ బ్రిగేడ్'ను ఏర్పాటుచేసినట్లు సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది వెల్లడించారు. దీనికి 'రుద్ర' అని పేరు పెట్టినట్లు తెలిపారు. శనివారం 'కార్గిల్ విజయ్ దివస్ ' సందర్భంగా ఆయన అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రుద్ర ఏర్పాటును ప్రస్తావించారు. భారత సైన్యం ప్రస్తుత సవాళ్లను విజయవంతంగా ఎదుర్కోవడంతో పాటు- భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఉండేలా ఈ యూనిట్‌ను ఏర్పాటు చేసినట్లు- జనరల్ ద్వివేది వెల్లడించారు. పదాతిదళం, యాంత్రిక పదాతిదళం, సాయుధ యూనిట్లు- ఫిరంగిదళం, ప్రత్యేక దళాలు, మానవరహిత వైమానిక వ్యవస్థలు వంటి వ్యవస్థలతో కూడిన దళం ఇదని వెల్లడించారు. అన్ని దళాలకు ఇందులో భాగస్వామ్యం ఉంటుంది. సరిహద్దులోని శత్రువుల వెన్నులో వణుకు పుట్టించేందుకు భైరవ్ అనే లైట్ కమాండో బెటాలియన్ యూనిట్లను కూడా ఏర్పాటు-చేసినట్లు- తెలిపారు. కాగా.. ఇప్పటికే రెండు పదాతిదళ బ్రిగేడ్‌లు రుద్రలో భాగమైనట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ఈసందర్భంగా ఆపరేషన్ సిందూర్ గురించి కూడా ఆయన మాట్లాడారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి దేశం మొత్తాన్ని కలచివేసిందన్నారు. దీనికి ప్రతిస్పందనగా ఆపరేషన్ సిందూర్ చేపట్టి ఉగ్రవాదాన్ని సహించేది లేదనే గట్టి సందేశాన్ని పాకిస్థాన్‌కు ఇచ్చామన్నారు. దేశ ప్రజల విశ్వాసం, ప్రభుత్వం ఇచ్చిన స్వేచ్ఛ కారణంగా ఇది సాధ్యమైందన్నారు. మన ఐక్యత, సార్వభౌమత్వాన్ని సవాలు చేయడంతో పాటు- ప్రజలకు హాని చేయాలని చూసేవారికి ఇది సరైన సమాధానం చెప్పిందన్నారు. పాక్‌లోని ఉగ్రమూకల సదుపాయాలను నేలమట్టం చేయడంతో పాటు- ఆ దేశ దుందుడుకు చర్యలను కూడా అరికట్టామన్నారు. భారత్ నిర్ణయాత్మకమైన విజయం సాధించిందని వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమరవీరులకు భారత వాయుసేన ఘనంగా నివాళులర్పించింది. కార్గిల్ యుద్ధం నాటి చిత్రాలతో ప్రత్యేక వీడియోను రూపొందించింది. ఆ వీడియోను వాయుసేన తమ అధికారిక ఎక్స్ ఖాతాలో పంచుకుంది. అమరవీరుల ధైర్యం, త్యాగం దేశ ప్రజలకు స్ఫూర్తినిస్తూనే ఉ ంటుందని పేర్కొంది. 1999 మే-జులై మధ్య భారత్, పాకిస్థాన్ మధ్య కార్గిల్ యుద్ధం జరిగిన విషయం తెలిసిందే. ముజాహిదీన్ల ముసుగులో నియంత్రణ రేఖ దాటి భారత భూభాగంలోకి చొచ్చుకు వచ్చిన శత్రు సైన్యాలు కార్గిల్‌లో ఖాళీగా ఉన్న కీలక స్థావరాలను వశం చేసుకున్నాయి. వీరి ఆక్రమణను తెలుసుకున్న భారత సైన్యం 'ఆపరేషన్ విజయ్'ను ప్రారంభించి.. ఎదురుదాడి చేసి స్థావరాలను తిరిగి సొంతం చేసుకుంది. ఇది జరిగి నేటికి సరిగ్గా 26 ఏళ్లు పూర్తయింది. అప్పటి నుంచి ప్రతి ఏటా జులై 26న కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహించుకుంటూ అమరవీరులకు నివాళులర్పిస్తున్నారు.

# ఆందోళనకరంగా ఎపి ఆర్థిక పరిస్థితి

అమరావతి,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై మాజీ సీఎం వైఎస్ జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదాయాలు లేకపోగా, శరవేగంగా అప్పులు పెరగటంపై జగన్ ఫైర్ అయ్యారు. ఈ సందర్భంగా కాగ్ నివేదికను తన సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. ప్రభుత్వ విధానాలతో రాష్ట్రం మరింత అప్పుల్లో కూరుకుపోయింది.. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలోనే రాష్ట్రంపై తీవ్రమైన ఆర్థిక ఒత్తిడి ఏర్పడింది.. ఈ విషయాన్ని కాగ్ తన నివేదికలోనే స్పష్టం చేసింది.. రాష్ట్రంలో ఆర్థిక స్థిరత్వం, నిర్వహణ సరిగా లేనేలేదు.. రాష్ట్ర విభజనతో మొదలైన సమస్య మరింత తీవ్రరూపం దాల్చింది అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. ఇక, దీనికి తోడు రాష్ట్రంలో అవినీతి విపరీతంగా పెరిగిపోయింది అని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్. ఖజానాకు రావాల్సిన ఆదాయం రాకుండా పోతోంది.. పన్ను ఆదాయం, పన్నేతర ఆదాయాలు పేలవంగా ఉన్నాయి.. కొన్ని శాఖల్లోనైతే అత్యంత అధ్వాన్నమైన వృద్ధిరేటు- కనిపించింది.. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి మూడు నెలల్లో ఏ÷ు ఆదాయాలు, అమ్మకపు పన్ను ఆదాయాలు గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే తక్కువగా ఉన్నాయి.. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో రాష్ట్ర సొంత ఆదాయాలు కేవలం 3.47 శాతం మాత్రమే పెరిగాయి.. కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే ఆదాయాలతో సహా మొత్తం ఆదాయాలు 6.14శాతం మాత్రమే పెరిగింది.. అప్పులు మాత్రం ఈ ఆర్థిక సంవత్సరం మొదటి మూడు నెలల్లో ఏకంగా 15.61శాం వేగంతో పెరిగాయని వైఎస్ జగన్ తెలిపారు.

# రాజకీయం అలా చేస్తారంతే !

హైదరాబాద్,రేవంత్ రెడ్డిని రాజకీయంలో గెలవడం అంత ఈజీ కాదని చాలా సింపుల్ గా మరోసారి నిరూపించారు. కాంగ్రెస్ హైకమాండ్ ఆయనపై అసంతృప్తితో ఉందని.. బీఆర్ఎస్ నేతలు చెప్పుకుంటున్నారు. అపాయింట్మెంట్ కూడా ఇవ్వడం లేదని.. ఫోటోలు కూడా దిగడం లేదని .. పలుకుబడి అంతా పోయిందని సంబరపడిపోతున్నారు. కాంగ్రెస్ పార్టీని కొంత మంది రేవంత్ వ్యతిరేకులు కూడా అదే అనుకుంటున్నారు. ఇటీవల రేవంత్ ను మార్చడానికి హైకమాండ్ అభిప్రాయ సేకరణ చేసిందన్న ప్రచారమూ జరిగింది. కానీ అవన్నీ రాజకీయంలో భాగమేనని .. రేవంత్ పట్టు ఏ మాత్రం తగ్గదని.. తగ్గకుండా చూసుకుంటారని మరోసారి నిరూపించుకున్నారు.తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణనను రాహుల్ గాంధీ అద్భుతంగా చూస్తున్నారు. ఈ క్రెడిట్ అంతా రేవంత్ రెడ్డికే ఇచ్చారు. రేవంత్ రెడ్డితో సమావేశానికి రాహుల్ ఇష్టడటం లేదని బీఆర్ఎస్ నేతలు అనుకుంటున్నారు. కానీ ఢిల్లీలో జరిగింది వేరు. అదే సమయంలో రేవంత్ రెడ్డి తన విధేయతా ప్రదర్శనకు ఏ మాత్రం తగ్గలేదు. రాహుల్, ప్రియాంక ల ముందు తనకు సోనియాపై ఉన్న విధేయతను చూపించారు. ఆమె నుంచి వచ్చిన లేఖ తనకు ఆస్కార్, నోబెల్ కంటే ఎక్కువ అని.. చెప్పి వారి మనసుల్ని గెల్చుకున్నారు. తర్వాత రేవంత్ కు..రాహుల్ ప్రత్యేకంగా లేచి నిలబడి మరీ షేక్ హ్యాండ్ ఇచ్చారు.రేవంత్ రెడ్డి సీఎంగా ఉ న్నారు. ఆయనకు పాలనా పరంగా బాధ్యతలు ఉంటాయి. కేంద్రం నుంచి సహకారం అవసరం. అందు కోసం కేంద్రంతో ఆయన సంప్రదింపులు ఎక్కువగానే ఉన్నాయి. ఇతర కాంగ్రెస్ ముఖ్యమంత్రుల కంటే చాలా ఎక్కువగా కేంద్ర మంత్రుల్ని కలుస్తున్నారు. పాలనా పరంగా%ౌ% కేంద్రంపై చేస్తున్న ఆరోపణలు తక్కువ. రాజకీయంగా మాత్రం బీజేపీని వదిలి పెట్టడం లేదు. అయినా పాలనా పరంగా చొరవ తీసుకుంటూ ఉండటంతో ఆయన బీజేపీ దారిలోకి వెళ్తున్నారని ప్రచారం చేస్తూ వస్తున్నారు. ఫిర్యాదులు చేస్తున్నారు.కానీ ఏం చేసినా..దాన్ని సరైన విధంగా మలచుకోవడం ఎలాగో తనకు తెలుసని రేవంత్ నిరూపించారు. హైకమాండ్ వద్ద రేవంత్ పలుకుబడి తగ్గిపోయిందని.. ఆశలు పెట్టుకున్న వారు ఇక.. ఆశలు వదిలేసుకుని రేవంత్ దారిలో నడిస్తే.. వారికి రాజకీయ భవిష్యత్ ఉంటుందన్న సంకేతాలు ఇచ్చేశారు.

# 'పరాయి' ముద్రతో వేట, వేధింపుల వెనుక...



సెంట్రల్ డెస్క్:గత కొంత కాలంగా దేశమంతటా భయాందోళనలు తాండవి స్తున్నాయి.భారీ సంఖ్యలో బెంగాలీ మాట్లాడే వలస కార్మికులను బంగ్లా దేశీయులుగా ముద్ర వేయడం ఇందుకు కారణమవుతున్నది. బెంగాలీ మాట్లాడ్డం, ముస్లింలై వుండటం కలగలిపి ఒక ప్రమాదకరమైన లేబుల్ తగిలిస్తున్నారు. వారిని ఉన్నఫళానా అక్రమ బంగ్లాదేశీ చొరబాటుదారులుగా ముద్ర వేస్తున్నారు.ఇది నిజంగానే ఒక తప్పుడు చిత్రణ. పౌరసత్వ సవరణ చట్టం రూపకల్పన వెనుక వున్నది ఇలాంటి తప్పుడు భావనే. ఈ ప్రచార కాండలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ముందు పీఠిన నిలిచారు. అస్సాం ప్రజలు సి.ఎ.ఎ పట్ల ఎలా స్పందించారో ఆయనకు తప్పక తెలిసి వుంటుంది. ఈ తరహా ప్రచారం సాగించే సందర్భంలో ఆయన ఈ అంశాన్ని అంతర్గర్భితంగా ప్రస్తావిస్తున్నారు. బెంగాలీ మాట్లాడే వారెవరైనా బంగ్లా దేశీయులను గుర్తించడానికి సహాయ పడతారని చెప్పేదాకా వెళ్లారు. అలా చెప్పడంలో అంతరార్థం ఏమిటంటే ఈ రెండింటి మధ్యనా విడదీయరాని ముడి వుందని సంకేతమివ్వడమే. రాజ్యాంగ విరుద్ధమైన ఈ వ్యాఖ్యపై తీవ్రాగ్రహం వ్యక్తం కావడంతో హిమంత ఒక విధంగా తప్పు ఒప్పుకోవలసి వచ్చింది: "సరే, వారంతా విదేశీయులే కానక్కరలేదని ఒప్పుకుందాం, అయితే అస్సామీలమైన మనం ప్రత్యేకించి హిందువులం మన గడ్డ మీద దిక్కులేని మైనారిటీలుగా అయిపోతున్నాం. కేవలం అరవై ఏళ్ల వ్యవధిలోనే ఇదంతా జరిగిపోయింది. మన సంస్కృతినీ, భూమినీ, దేవాలయాలను పోగొట్టుకున్నాం. చట్టం మనకు సహాయ పడిందేమీ లేదు. అందుకే మనం నిస్పృహతో వున్నాం. అది మనుగడ కోసమే తప్ప ప్రతీకారానికి కాదు."

భూముల పరాధీనం

అయితే ఈ నిస్పృహ వచనాలలో పిసరంతైనా పశ్చాత్తాపం లేదు. బెంగాలీ మాట్లాడే వలస కార్మికులందరూ బంగ్లా దేశీయులేనన్న అంచనాతో వారికి వ్యతిరేకంగా మాట్లాడ్డం బూటకమే. సరిహద్దుల ఆవలికి ఈ నిస్సహాయ ప్రజానీకాన్ని నెట్టివేసేందుకోసం అధికారులు చేసిన ప్రయత్నాలన్నీ అందుకు అవసరమైన ఆధార పత్రాలు చూపించడంలో ఎప్పటికప్పుడు విఫలమవుతూ వస్తున్నాయి. ఈ ప్రయత్నాల వెనుక అసలు ఉద్దేశమేమిటో కూడా అంత కంతకూ స్పష్టమవుతున్నది. వారిని వారి భూముల నుండి వెళ్లగొట్టాలి. తరచూ ఇందుకోసం బుల్డోజర్లు వినియోగించడం జరుగుతుంది. అలా తీసుకున్న భూములను కార్పొరేట్ భూ కబ్జాదార్లకు అప్పగించడమే జరుగుతుంది. ఉత్తరోత్తరా అదో భూ సంబంధమైన అవినీతి వ్యవహారాలకు దారితీస్తుంది. అంతేగాక ఈ ప్రచారం వల్ల రాష్ట్రంలోని బహు జాతులతో కూడిన వైవిధ్యభరిత ప్రజానీకంలో విభజన మరింత తీవ్రమవుతుంది. మరీ ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికలు రానున్న తరుణంలో. అంతిమంగా ఈ వివాదాలు రాష్ట్ర ప్రభుత్వ విస్తృత వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి దోహదం చేస్తాయి.

చారిత్రిక వాస్తవాలేంటి?

1971 తర్వాత బంగ్లాదేశ్ నుంచి అస్సాంలోకి వలసలు కొనసాగిన మాట కాదనలేనిదే కానీ అక్రమ వలసదారులు మిడతల దండులా వచ్చి రాష్ట్రాన్ని ఆక్రమించేస్తున్నారనే భయాందోళనలు మాత్రం బూటకమైనవి. వాస్తవ విరుద్ధం. అఖిల భారత స్థాయిలో జనాభా పెరుగుదలకు భిన్నంగా అస్సాంలో గత కొన్ని సంవత్సరాల్లో జనాభా పెరుగుదల తగ్గుముఖంలో వుంది. అక్రమ వలసదారులు ముంచెత్తు తున్నారనే పాట మాత్రం ముదిరిపోయినట్టు కనిపిస్తుంది. ఈ ప్రాంతంలో ముస్లిం జనాభా పెరిగిపోతున్నదనే భయాందోళన సృష్టించడమే ఇందుకు చాలావరకూ కారణం.జనాభా విషయాల అధ్యయనాలు కూడా వలసవాద పాలనలో తిరుగులేని విధంగా అస్సాం జనాభా పొందిక మారిందని నిర్ధారణగా చెప్పాయి. తూర్పు బెంగాల్ నుంచి నిరంతరాయంగా వలసలు జరగడమే ఇందుకు కారణమైంది. 1901-1941 మధ్య ఒక క్రమ పద్ధతిలో వలస ప్రభుత్వం ఈ వలసలను ప్రోత్సహించడం వల్ల ఈ ప్రాంతంలో జనాభా పొందిక స్వరూపం మారిపోయింది. ఎన్నికల సంఘం నొక్కి చెబుతున్న మాటలు నమ్మేట్టయితే ఒక ప్రశ్న సహజంగానే వచ్చేస్తుంది. దేశ విభజనకు ముందు అస్సాంలో స్థిరపడిన లక్షలాది మంది తూర్పు బెంగాల్ ముస్లిం వలస రైతుల వారసులు ఎక్కడ స్థిరపడ్డారు?

ఫేక్ కథలు, ఘోర జ్ఞాపకాలు

కనుక హిమంత అదేపనిగా చేస్తున్న నిర్ధారణలు జాతి పరమైన, మత పరమైన కథనాలకు అనుగుణంగానే సాగుతున్నాయి. కానీ జనాభా వివరాలు భిన్నమైన సత్యాలు చెబుతున్నాయి: 1991-2001కీ 2001-2011కీ మధ్య దశాబ్దాలలో బంగ్లాదేశీ వలసదార్ల సంఖ్య 2.79 లక్షల నుంచి 1.72 లక్షలకు తగ్గిపోయింది. అంటే దాదాపు సగానికి సగం పడిపోయిందన్న మాట. అయితే ఈ ఫేక్ న్యూస్, వైరల్ వాట్సప్ ఫార్వర్డ్‌ల కాలంలో నిజమైన లెక్కలు ఎవరికి కావాలి? ఈ ధోరణి కేవలం అస్సాంకే పరిమితం కాదు. దేశంలోని విస్తార ప్రాంతాల్లో ప్రత్యేకించి బిజెపి పాలించే రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడే ముస్లింలందరూ బంగ్లాదేశ్ అక్రమ వసలదారులనే ప్రచారం భారీగా సాగుతున్నది. అధికార పత్రాలను ఏ మాత్రం పరీక్షించకుండానే ప్రజలను వేధింపులకు గురి చేస్తున్నారు. అనేకసార్లు హింస పెడుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో ముస్లింల సంఖ్య సుమారు 2.47 కోట్లు వుంటుంది. మొత్తం 9.13 కోట్ల రాష్ట్ర జనాభాలో ఇది 27.01 శాతం, ఆర్థిక పరిస్థితులు దిగజారుతున్న ప్రస్తుత నేపథ్యంలో వారిలో అనేకులు పనికోసం రాష్ట్ర సరిహద్దులు దాటి బయిటకు పోవడం సహజమే. ఆ విధంగా రాష్ట్రాంతర వలసలో చెప్పుకోదగిన భాగంగా వుండొచ్చు.పౌరసత్వాన్ని నిర్ధారించే ఏకాంశ అధికార పత్రంతో కాకుండా, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ కార్డు ఎపిక్ వంటి వాటన్నిటినీ తోసిపారేసేట్టయితే ఈ శ్రామికులు ఎంత దారుణంగా దెబ్బ తింటారనేది ప్రత్యేకంగా వివరించాల్సిన అవసరం లేదు. వారు ఎంత ప్రమాదకర పరిస్థితిలో వున్నదీ కోవిడ్-19 తరుణంలోనే నగంగా వెల్లడైంది. వలస కార్మికులు వందల కిలోమీటర్లు నడిచిపోవడం. ఒక తల్లి బిడ్డను సూట్‌కేస్ మీద కూర్చోబెట్టి చక్రాలతో తోసుకుంటూ పోవడం, నడిచే రైలు కిందపడి చితికిపోయి చెల్లాచెదురైన వలస కార్మికుల దేహ ఖండాలు ఇంకా మనందరి మస్తిష్కంలో వెంటాడుతూనే వున్నాయి.

వ్యవస్థ లక్షణమే

ప్రపంచీకృత పెట్టుబడిదారీ వ్యవస్థలో వలస కార్మికులనేవారు ఒక అవిభాజ్య భాగంగా వుంటారనేది తెలియడానికి ఎవరూ చరిత్ర లోతుల్లోకి పోవలసిన అవసరం లేదు. పెట్టుబడిదారీ విధానం వలసలు, అర్ధ వలసల నుంచి ఆర్థికంగా బలహీనంగా వున్న ప్రాంతాల నుంచి తెచ్చిన శ్రామికులపైనే ఆధారపడి పెరిగింది. 19వ శతాబ్ది ద్వితీయార్థంలో టీ, కాఫీ, చెరకు, రబ్బరు తోటలు పెరిగాయి. రైల్వేలు, టెలిగ్రాఫ్ లైన్లు, నవీన గనుల తవ్వకాల ప్రారంభం వంటివన్నీ పెద్ద ఎత్తున జరిగింది అలాగే. శ్రామిక బలగాల చలనశీలత అటూ ఇటూ తరలిపోవడం కూడా అంతకు ముందెన్నడూ లేని స్థాయిలో సాగింది. ఉత్తరోత్తరా రాజ్యాలు వలసల క్రమబద్ధీకరణ, నిర్వహణకు వ్యవస్థలను పెంపొందించాయి. ఆ అంశానికున్న రాజకీయ ఆర్థిక ప్రాధాన్యతను గుర్తించాయి.

21వ శతాబ్దంలో ద్రవ్య పెట్టుబడితో నడిచే ప్రపంచీకరణ, ఘర్షణల కారణంగా కలిగే నిర్వాసం, దేశాంతర శ్రామిక ప్రవాహాలతో వలసలు సరికొత్త తక్షణాంశాలుగా తయారైనాయి. అయినా సరే దాంతోపాటే అభివృద్ధి నిరోధక మితవాద భావజాలాలు కూడా పెరిగిపోయాయి. అస్తిత్వ ఆధారిత సమీకరణలను సృష్టించడానికి ఇది వారికి వాటమైన ఆయుధంగా తయారైంది.

ట్రంప్ టు ఆర్ఎస్ఎస్

"ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వలస కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారు. 2022లో మొత్తం ప్రపంచ శ్రామిక బలగంలో వీరు 4.7 శాతంగా వున్నారు.

# భాగ్యనగర సౌభాగ్యం నిలిపేదెలా?

హైదరాబాద్,చిన్న వర్షం వచ్చినా హైదరాబాద్ రోడ్లు వరదలను తలపిస్తున్నాయి. మామూలు రోజుల్లో ట్రాఫిక్ చిర్రెత్తు కొచ్చేలా చేస్తోంది. ఎక్కడికి వెళ్లాలన్నా ఇబ్బందిగా మారుతోంది. వర్షాం వస్తే నరకం కనిపిస్తోంది. హైదరాబాద్ విస్తరిస్తున్నా అందుకు తగ్గట్లుగా డ్రైనేజీని ఆధునీకరించడం లేదు. అలాగే వానవస్తే నీరు పోయేలా చేయడం లేదు. వేలకోట్ల ఆదాయం వస్తున్నా నగరం అభివృద్ధి విషయంలో పాలకులు శ్రద్ధ వహించడం లేదు. కెసిఆర్ హైదరాబాద్ గురించి కాకమ్మ కబుర్లు ఎన్నో చెప్పారు. హుస్సేన్ సాగర్‌ను కొబ్బరినీళ్లలా తయారు చేస్తానని ప్రగల్భాలు పలికారు. దాదాపు పదేళ్లు అధికారంలో ఉన్నా ఆ వైపు కన్నెత్తి చూడలేదు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తోంది. అయినా ఎలాంటి పురోగతి కానరావడం లేదు. ప్రలను బుజ్జగించే పనులు తప్ప కఠినంగా నగర సుందరీకరణ, ట్రాఫిక్ ఫ్రీ రోడ్లను అభివృద్ధి చేయడం లేదు. హైదరాబాద్ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం కావాలి. ప్రధానంగా మురుగునీరు, చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు,ట్రాఫిక్ సమస్యలు ఎప్పటినుంచో వేధిస్తున్నాయి. నగరంలో చెత్తను ఎక్కడపడితే అక్కడ వేసేస్తున్నారు. ఈ విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. చెత్తను వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ పడేసే విధానాలకు స్వస్తి పలకాలి. అవసరమైతే జరిమానాలు విధించాలి. దీనికితోడు నగరంలో రోడ్లపై వెలసిన ఆలయాలు,దర్గాలు, ఇతర కట్టడాల తొలగింపుపై కఠిన చర్యలకు ఉపక్రమించాలి. లేకుంటే అవి రోడ్లకు అడ్డంగా ఉండడం వల్ల ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. వీటి గురించి ఏ పార్టీ వారు కూడా మాట్లాడడం లేదు. మత కట్టడాలను తొలగించడం పాపమనా లేక, పార్టీలకు భయపడో కానీ వాటి జోలికి వెళ్లడం లేదు. హైదరాబాద్‌తో అనుబంధం ఉన్న వారిని, రాజకీయ పార్టీలను కూర్చోబెట్టి ఈ సమస్యలపై చర్చించాలి. రోడ్డు మధ్యలో ఉన్న ప్రార్థనా స్థలాలు, దర్గాల తొలగింపు అనివార్యం కావాలి. నగర సుందరీకరణ, విస్తరణలో వీటి తొలగింపు అత్యంత ముఖ్యం. అలాగే నాలాల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలి. హైడ్రా కొంతమేర కూల్చివేతలు చేపట్టడం ఆహ్వానించదగ్గదే. అయితే నాలాల ఆక్రమణలను పెద్ద ఎత్తున తొలగించాలి. డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేసుకోవాలి. వర్షం వస్తే కాలనీలు మునిగే పరిస్థితి నుంచి బయటపడేలా ప్రణాళికలు సిద్దం చూసుకోవాలి. హైదరాబాద్ రూపు రేఖలు మారబోతున్నాయన్న విశ్వాసం ప్రజల్లో కలగాలి. ప్రజలను కూడా ఇందులో బాధ్యులను, భాగస్వాములను చేయాలి. ఇప్పటికే శివారు ప్రాంతాలు బాగా అభివృద్ధి చెందాయి. తెలంగాణకు మణిహారమైన హైదరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సిఎం రేవంత్ రెడ్డి పదేపదే చెప్పడం కాకుండా ప్రణాళికలు సిద్దం చేయాలి. నగరంలో పారిశుద్ధ్య, మురుగు నీటి, తాగునీటి సమస్యలు గత కొన్నేళ్లుగా నిర్లక్ష్యానికి గురైనట్లు ఎవరైనా అంగీకరించాల్సిందే. భాగ్యనగరాన్ని మరింత ప్రణాళికా బద్ధంగా తీర్చిదిద్దేందుకు



చర్యలు చేపట్టాల్సి ఉంది. దీనికితోడు మెట్రో విస్తరణ, మూసీ సుందరీకరణతో నగర రూపురేఖలు మారుతాయి. పట్టణ విపత్తుల నివారణకు, వాటిని ఎదుర్కొన డానికి తీసుకోవాల్సిన చర్యలను చేపట్టడంతో పాటు, ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొని తక్షణ రక్షణ చర్యలు తీసుకొనే విషయంలో జాతీయ, రాష్ట్రేతర సంస్థలతో సమన్వయం చేసుకోవాలి. ఇప్పుడు హైడ్రా తన పనిని వేగంగా చురుకుగా చేపట్టడం కలసి వస్తోంది. అలాగే అన్యక్రాంతం అయిన భూములను పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇకపోతే ప్రధానంగా నగరంలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో పాటు శివారు ప్రాంతాలు విస్తరించి, నగరంలో కలిసి పోవడం, పట్టణీకరణ విషయంలో క్రమపద్ధతి లేకపోవడంతో నగరం నరకకూపంగా మారుతోంది. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా సుమారు 110 చదరపు కి.మీల పట్టణ ప్రాంతం పునరుజ్జీవనం చేస్తామని సిఎం రేవంత్ పదేపదే ప్రకటించారు. అలాగే, నదీ తీర ప్రాంతంలో క్రొత్త వాణిజ్య, నివాస కేంద్రాలు వెలిసి, పాత హెరిటేజ్ ప్రాంతాలు క్రొత్తదనాన్ని సంతరించు కుంటాయి. ఇకపోతే జిహెచ్ఎంసి పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. ఎయిర్ పోర్ట్ వరకూ మెట్రో విస్తరణ సాకారమయితే మరింత సౌకర్యంగా ఉ ంటుంది. పాత నగరానికి మెట్రో విస్తరణ, మల్టీ మోడల్ సబర్బన్ రైలు ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ వంటివన్నీ కూడా ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసేవే. ఇకపోతే నగరంలో విలువైన భూములు అన్యాక్రాంతం అయినా గత పదేళ్లుగా పట్టింపు లేకుండా పోయింది. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లోని ప్రభుత్వ భూములు ఏ విధంగానైతే అన్యాక్రాంతమయ్యాయో, స్వరాష్ట్రంలో దానికి రెట్టింపు భూ విధ్వంసం జరిగింది. ఆనాటి గొలుసుకట్టు చెరువులు చాలా మాయం చేసి, కొండలు, గుట్టలను పిండి చేసి రియల్ ఎస్టేట్ ప్లాట్లుగా మార్చేసి అమ్మేశారు. గత ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ప్రభుత్వ భూములకు రక్షణగా ఉండే వీఆర్ఓ, వీఆర్ఏలను రెవెన్యూ శాఖ నుంచి దూరం చేయడంతో కబ్జాలకు ప్రభుత్వమే ఉసిగొలిపినట్టయ్యింది.

# గోవా గవర్నర్‌గా అశోక్‌గజపతి ప్రమాణం

పనాజి,గోవా గవర్నర్‌గా పూసపాటి అశోక్ గజపతిరాజు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే ఉదయం 11.30 గంటలకు రాజ్‌భవన్ బంగ్లా దర్బార్ హాల్‌లో అశోక్ గజపతిరాజుతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎపి మంత్రులు నారా లోకేష్, సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు- పలువురు టిడిపి ఎంపీలు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం నేపథ్యంలో అశోక్ గజపతి రాజు తన కుటుంబ సభ్యులతో కలసి శుక్రవారం ఉదయమే గోవాకు చేరుకున్నారు. ఆయన వెంట కుమార్తె స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి, భార్య సునీలాగజపతి, ఇతర కుటుంబ సభ్యులు వెళ్లారు. అశోక్ గజపతిరాజు ప్రమాణ స్వీకారానికి జిల్లాలో ఉన్న అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు వందల సంఖ్యలో గోవాకు తరలి వెళ్లారు. గోవా గవర్నర్‌గా పూసపాటి అశోక్ గజపతిరాజు ప్రమాణ స్వీకారంలో పాల్గొనేందుఉ టిడిపి శ్రేణులు కూడా హాజరయ్యారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, మంత్రివర్గ సభ్యులు, ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఏపీ మంత్రులు నారా లోకేశ్, సంధ్యారాణి, తెలుగుదేశం ఎంపీలు, ఏపీ బీజేపీ అధ్యక్షుడు, నేతలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రమాణస్వీకారం అనంతరం అశోక్ గజపతిరాజును గోవా అధికారులు పరిచయం చేసుకున్నారు. ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ స్వయంగా పరిచయం చేశారు. అనంతరం మంత్రి నారా లోకేష్.. గజపతిరాజుకు బొకే ఇచ్చి.. శాలువా కప్పి సన్మానించారు.

# చంద్రబాబు కీ రోల్ ఇదే.. !

న్యూఢిల్లీ,దేశంలో ఉపరాష్ట్రపతి ఎన్నిక వ్యవహారం తెర మీదకు వచ్చింది. జగదీప్ ధన్‌ఖడ్‌ఆ పదవికి రాజీనామా చేయడంతో ఉపరాష్ట్రపతి పదవి ఖాళీ అయింది. దీంతో కేంద్ర ఎన్నికల సంఘం ఉపరాష్ట్రపతి ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధమైంది. వాస్తవానికి ఉపరాష్ట్రపతి పదవికి ఎవరైనా రాజీనామా చేసినా.. లేదా పదవీ విరమణ జరగడానికి ముందు 60 రోజుల సమయంలో కొత్త రాష్ట్రపతిని ఎన్నుకోవడం అనేది సంప్రదాయం. ఇప్పుడు అనూహ్యంగా జగదీప్ రాజీనామా చేయడంతో 60 రోజులు పాటు కొత్త ఉపరాష్ట్రపతిని ఎన్నుకునేందుకు సమయం ఉంటుంది.కానీ ఈ దఫా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కేవలం 30 రోజుల్లోనే కొత్త ఉపరాష్ట్రపతిని ఎన్నుకోవాలి అన్న ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తుంది. అయితే కేంద్రంలో మోదీ ప్రభుత్వానికి మద్దతుగా ఉన్న చంద్రబాబు ఈ విషయంలో ఎలాంటి పాత్ర పోషిస్తారు.. ఏ విధంగా ముందుకు వెళ్తారు.. అనేది జాతీయ మీడియాలో చర్చకు దారితీసింది. ఎందుకంటే గత ఎన్నికల్లో మంత్రివర్గ ఎంపిక సమయంలోను, కేంద్ర ప్రభుత్వం ఏర్పాటులోనూ చంద్రబాబును పక్కన కూర్చోబెట్టుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు.ఎందుకంటే టీడీపీ మద్దతు మోడీ ప్రభుత్వానికి అత్యంత కీలకం. వచ్చే ఎన్నికలకు ఎలా ఉన్నా.. గత ఎన్నికల్లో బిజెపి 240 స్థానాలకే పరిమితం కావడంతో ఏపీలోని టిడిపి, బీహార్ లోని జెడియు పార్టీలు మోడీకి మద్దతుగా నిలిచాయి. ఈ క్రమంలోనే ఆయన ఈ రెండు పార్టీలకు ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు. ఇప్పుడు అత్యంత కీలకమైన ఉపరాష్ట్రపతి ఎన్నికల సమయంలో కూడా చంద్రబాబుకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. ఆయన అభిప్రాయాలు ఆయన సూచనలను కూడా పరిగణలోకి తీసుకోవాలి.ఒకవేళ చంద్రబాబు తనకు నచ్చిన వారి పేరును సూచించినా.. కేంద్రం ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని దాని ప్రకారం వ్యవహరించాల్సి ఉంటుంది. అయితే, ఇప్పటివరకు కేంద్రం నుంచి చంద్రబాబుకు ఈ తరహా సూచనలు కాని ఈ తరహా సలహాలు ఇవ్వమని ఎటువంటి సంకేతాలు పంపించకపోవడం... అదేవిధంగా తనంతట తామే ఉపరాష్ట్రపతి అభ్యర్థిని ఎంపిక చేసుకోవటం వంటివి రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.ఈ విషయాన్ని చంద్రబాబు లైట్ తీసుకున్నా.. ఏపీలోని ప్రత్యర్థి పక్షాల నుంచి మాత్రం ఆయనకు విమర్శలు తప్పేలా లేవు. కేంద్రంలో కూటమి ప్రభుత్వాన్ని నిలబెట్టిన చంద్రబాబును కనీసం సంప్రదించకుండానే ఉపరాష్ట్రపతి అభ్యర్థిని ఎంపిక చేశారు.. అన్న వాదన చంద్రబాబు మెడకు చుట్టుకుంటుంది. పైగా ఉపరాష్ట్రపతి పదవి కావడం.. అందులో టిడిపి ఎంపీలు కూడా ఓటు వేయాల్సి రావడంతో మరింతగా చంద్రబాబుకు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతుంది.దీనిని బట్టి బిజెపి విషయంలోను, ఉపరాష్ట్రపతి ఎంపిక, ఎన్నిక విషయంలోనూ చంద్రబాబు వ్యూహాత్మకం గా వ్యవహరించి తన ప్రాధాన్యాన్ని కూడా చెప్పుకునేలాగా తన సూచనలు చేసేలాగా వ్యవహరించాల్సి ఉంటుంది. లేకపోతే విమర్శలు రావడం ఖాయమని పరిశీలకులు భావిస్తున్నారు.

# కాంగ్రెస్ గెలుస్తుందా?

హైదరాబాద్, గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికలపై అధికార కాంగ్రెస్ ఫోకస్ పెట్టింది. ఈ సారి ఎలాగైనా గెలిచి గ్రేటర్ లో పూర్వ వైభవాన్ని తీసుకురావాలని కాంగ్రెస్ పట్టుదలతో కనిపిస్తోంది. ఆ క్రమంలోనే గ్రేటర్ హైదరాబాద్‌కు సంబంధించిన కాంగ్రెస్ నూతన కమిటీలు వేయడంతో పాటు జిహెచ్ఎంసీ నేతలతో వరుస భేటీలు నిర్వహిస్తు పార్టీని బలోపేతం చేసేందుకు కసరత్తులు ప్రారంభించి క్యాడర్‌ను యాక్టివ్ చేయాలని భావిస్తోంది. అసలు ఇంతకు గ్రేటర్ పరిధిలో అధికార పార్టీ వేస్తున్న ఎత్తులు ఏంటి%ా?

జీహెచ్ఎంసీలో పాగా వేయాలని పట్టుదలగా ఉన్న కాంగ్రెస్

త్వరలో జిహెచ్ఎంసీలో జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి పావులు కదుపుతున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ ఇన్ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ నియోజకవర్గాల వారీగా సమీక్ష సమాశాలు నిర్వహిస్తున్నారు. దాంతో పాటు హైదరాబాద్ జిల్లా పార్టీ సంస్థాగత ఇన్ఛార్జ్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సైతం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహించి ఆయా నియోజకవర్గ పరిధిలోని నేతల సమస్యలు, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుంటున్నారు. వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నం చేయడంతో పాటు జగ్గారెడ్డి తగిన సూచనలతో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు పార్టీ వ్యవహారాల ఇన్ ఛార్జ్ మీనాక్షి నటరాజన్ కు నివేదికను కూడా అందజేశారు.

ఎంఐఎంతో కలిసి బల్దియా పీఠాన్ని షేర్ చేసుకున్న కాంగ్రెస్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఉన్నప్పుడు జీహెచ్ఎంసీ పరిధిలో కాంగ్రెస్ బలంగా ఉండేది. ముఖ్యంగా వైస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2004 నుండి 2009 వరకు గ్రేటర్ హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ తిరుగు లేని శక్తిగా ఎదిగింది. ఆనాడు హైదరాబాద్ లో మొత్తం14 ఎమ్మెల్యే స్థానాలు ఉ ండగా నాలుగు కాంగ్రెస్ పార్టీ, మిత్రపక్షాలుగా టిడిపి, బిజెపి టీఆరెఎస్ 6 స్థానాల్లో, ఎంఐఎం 4 స్థానాల్లో విజయం సాధించాయి. అప్పట్లో కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో జిహెచ్ఎంసీ మేయర్ పీఠాన్ని గెలుచుకుంది. తనకు మిత్రపక్షంగా ఉన్న ఎం.ఐ.ఎంతో కలిసి బల్దియా పీఠాన్ని షేర్ చేసుకుంది.

2014, 18 ఎన్నికల్లో గ్రేటర్‌లో ఖాతా తెరవని కాంగ్రెస్

ఇక రాష్ట్ర విభజన తర్వాత గ్రేటర్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా బలహీన పడింది. హైదరాబాద్ నగరంలో బలమైన నేతలుగా ఉన్న పి.జనార్దన్ రెడ్డి, ముఖేష్ గౌడ్ మరణించడం పెద్ద మైనస్‌గా మారింది.

# పవన్ ని జనసేనను ఎందుకు జేడీ వదిలేశారు ?



అమరావతి,జేడీ లక్ష్మీనారాయణ అంటే అందరికీ తెలుస్తుంది. వీవీ లక్ష్మీనారాయణ అంటే తెలియదు. అంతలా తాను చేసిన ఉద్యోగం ద్వారా ఆయన గుర్తింపు సంపాదించారు. సీబీఐ జేడీగా పనిచేసిన ఆయనకు అదే ఇంటి పేరు అయింది. సినీ హీరోకు ఉండే పాపులారిటీ ఆ రోజులలో ఆయనకు ఉండేది. అటువంటి జేడీ తన వృత్తిపరంగా ఇంకా ఎక్కాల్సిన శిఖరాలు ఎన్నో ఉండగా మధ్యలో వదిలేసి రాజకీయాల్లోకి ఎందుకు వచ్చారు. అసలు ఆయన జనసేనలో ఎందుకు చేరారు, ఎందుకు వదిలేశారు ఇవన్నీ చాలా మందికి ఇప్పటికీ వేధించే ప్రశ్నలు. వాటికి జేడీ ఒక ప్రముఖ టీవీ చానల్ పాడ్ కాస్టులో చాలా ఆసక్తికరమైన జవాబులు చెప్పారు.

అందుకే జనసేనకు దూరం :

తాను రాజకీయాల్లోకి వచ్చింది ఉత్తమ సమాజం కోసం మంచి ప్రభుత్వం కోసం జవాబు దారీతనంతో పనిచేసే పాలన కోసమని చెప్పారు. అందుకే తన సర్వీసు ఎంతో ఉండగానే పదవికి రాజీనామా చేసి బయటకు వచ్చాను అని చెప్పారు. ఇక పవన్ కళ్యాణ్ అదే సమయంలో సినిమాలు వదిలేసి సొంత పార్టీ పెట్టారు అన్నారు. ఇద్దరి లక్ష్యం ఒక్కటే. జీరో బేస్డ్ పాలిటిక్స్ అని అన్నారు. అందుకే చేయి కలిపామని అన్నారు. అయితే 2019లో పార్టీ ఓడాక పవన్ సినిమాలలోకి తిరిగి వెళ్ళారని అది నచ్చకనే తాను జనసేనకు దూరం అయ్యాను అన్నారు. రాజకీయాల్లో పూర్తిగా ఉంటేనే సీరియస్ నెస్ వస్తుందన్నది తన భావన అన్నారు.

ఎంపీగా అధికారంలో ఉండేవారా :

ఇదిలా ఉంటే 2024 ఎన్నికల్లో టీడీపీ బీజేపీ జనసేన కలసి పోటీ చేశాయి. పైగా జనసేనకు 21 అసెంబ్లీ సీట్లు రెండు ఎంపీ సీట్లు దక్కాయి. సెంట్ పర్సెంట్ స్ట్రైకింగ్ రేటు వచ్చింది. ఈ సమయంలో జేడీ కనుక పార్టీలో ఉంటే కచ్చితంగా ఎంపీ అయి ఉండేవారు కదా అన్న యాంకర్ ప్రశ్నకు ఆయన ఆయన బదులిస్తూ అధికారంలో ఉండలేనందుకు ఎలాంటి బాధ లేదని అన్నారు ప్రజా సమస్యలు పరిష్కారం కావాలన్నదే తన ఆలోచన అన్నారు. అందుకే తాను జై భారత్ పార్టీని స్థాపించి పోరాటం చేస్తున్నాను అన్నారు.

జగన్ ఓటమి వెనక ఈవీఎం :

వైసీపీ 151 సీట్లతో 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చి 2024 నాటికి కేవలం 11 సీట్లకు పరిమితం కావడం మీద జేడీ వ్యాఖ్యానిస్తూ జనాలు మార్పు కోరుకున్నారు అన్నారు. నవరత్నాలు ద్వారా సంక్షేమం అందించినా ఇంకా ఎక్కువ పథకాలు ఇస్తామని కూటమి చెప్పిందని గుర్తు చేశారు. మూడు పార్టీల కలయికతో బలం చేకూరిందని అలాగే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ మీద జరిగిన చర్చ వైసీపీని బాగా దెబ్బ తీసిందని అన్నారు. అయిదేళ్ళ పాలనలో లా అండ్ ఆర్డర్ లేకపోవడం కూడా జనాలు గమనించారు అన్నారు. ఈవీఎంల పాత్ర ఏదీ ఓటమి వెనక లేదని అన్నారు. అయితే ఈవీఎంల విషయంలో విపక్షాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్న క్రమంలో ఆ సందేహాలు తీర్చాల్సిన బాధ్యత అయితే ఈసీ మీద ఉందని జేడీ అన్నారు.

కూటమి ఫోకస్ అటు వైపే :

ఏపీలో టీడీపీ కూటమి పదనాలుగు నెలల పాలలో రెండు అంశాల మీద పూర్తిగా ఫోకస్ పెట్టినట్లుగా అర్థం అవుతోందని జేడీ అన్నారు. అమరావతిని ప్రపంచ రాజధానిగా చేయడం పోలవరం ప్రాజెక్టుని పూర్తి చేయడం మీద దృష్టి పెట్టారు అన్నారు. ఇంకా కూటమి పాలనను జనాలతో పాటు తామూ గమనిస్తున్నామని ప్రజల సమస్యలు పరిష్కారం కాకపోతే తమ పార్టీ తరఫున పోరాటం చేసేందుకు సిద్ధమని అన్నారు.

కేసీఅర్ రేవంత్ ల గురించి :

తెలంగాణాలో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ లో ఉంటూ ప్రజలకు బాగా దగ్గర అయ్యారని ఆయన నిబద్ధత వల్లనే ముఖ్యమంత్రి పీఠం అంది వచ్చిందని అన్నారు. కేసీఆర్ తన పార్టీ ఎమ్మెల్యేలను మార్చి ఉంటే ఫలితాలు వేరే విధంగా ఉండేవన్న భావన కూడా ఉందని అన్నారు. కేసీఆర్ అధికారంలో ఉన్నపుడు పెద్దగా అందరినీ కలవలేదని అపవాదు ఉందని అన్నారు. ఇక రేవంత్ చురుకైన నాయకత్వం కాంగ్రెస్ కి తోడు అయి బీఆర్ఎస్ కి సరైన ఆల్టర్నేషన్ గా మారిందని అన్నారు. అందుకే విజయం దక్కిందని చెప్పారు.

ఎన్నికల సంస్కరణలు రావాలి :

అవినీతిపరులు నేరగాళ్ళు ఎన్నికల్లో పోటీ చేయకుండా పదునైన చట్టాలు రావాలని జేడీ అభిప్రాయపడ్డారు. ఈ రోజున పార్లమెంటులో దాదాపుగా 39 శాతం మీద క్రిమినల్ కేసులు ఉన్నాయని ఏపీ అసెంబ్లీలో 70 శాతం మంది మీద కేసులు ఉన్నాయని ఆయన చెప్పారు. ఒక రాజకీయ నాయకుడి మీద కేసు ఫైల్ అయిన వెంటనే పోటీకి అనర్హుడిని చేసేలా చట్టం రావాలని అన్నారు అలాగే నిర్బంధ ఓటింగ్ ని ప్రవేశపెట్టాలని, రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చే విధానాన్ని రద్దు చేయాలని ఆయన కోరారు. అదే విధంగా సీట్ల బట్టి కాకుండా ఆయా రాజకీయ పార్టీలకు వచ్చిన ఓట్ల శాతం బట్టి అధికారంలో వాటా ఉండేలా విధానాలు తీసుకుని రావాలని కోరారు. మొత్తం మీద తాను రాజకీయాల్లోకి వచ్చిన తరువాత ఏనాడూ బాధపడలేదని ప్రజలకు సేవ చేయడానికి ఇది ఒక విశాల వేదికగా భావిస్తున్నాను అని జేడీ చెప్పారు.

# తాడేపల్లి ముఖం చూడని జగన్...అక్కడ సీరియస్ గానే ?



అమరావతి,వైసీపీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్ 2024 ఎన్నికల్లో ఓటమి చెందాక బెంగళూరులోని తన పాలెస్ లో ఉంటున్నారు. ఆయన వారంలో నాలుగు రోజుల పాటు తాడేపల్లికి వస్తూంటారు. ఈ సందర్భంగానే పార్టీ నాయకులతో సమావేశాలు నిర్వహిస్తూ ఉంటారు. అలా గత ఏడాదిగా సాగుతోంది. కానీ ఈసారి దానికి భిన్నంగా వారం రోజుల పాటు ఆయన ఈ వైపు రాలేదని అంటున్నారు. జగన్ తాడేపల్లికి ఈ వారం రాలేదని ప్రచారం సాగుతోంది.

హాట్ డిస్కషన్స్ దానిమీదేనా :

వైసీపీ అధినేత బెంగళూరులోని తన నివాసంలో ఒక ఇష్యూ మీద హాట్ డిస్కషన్స్ చేస్తున్నారు అని ప్రచారం అయితే సాగుతోంది. అదే లిక్కర్ స్కాం అని అంటున్నారు. వైసీపీ అధినాయకత్వం మొదట్లో లిక్కర్ స్కాం ని పెద్దగా పట్టించుకోలేదని అంటున్నారు. అయితే ఈ కేసుని ఒక పద్ధతి ప్రకారమే సిట్ దర్యాప్తు చేస్తోంది అని తెలుస్తోంది. దాంతో లోతుల్లోకి వెళ్తే ఎక్కడైనా ఇబ్బంది అవుతుందా అన్న చర్చ కూడా వైసీపీ పెద్దలలో ఉందని అంటున్నారు. జగన్ సైతం ఇదే విషయం మీద తన సన్నిహితులతో చర్చలు జరుపుతున్నారని ప్రచారం అయితే సాగుతోంది.

అనుకోనిది జరిగితే :

ఇదిలా ఉంటే మద్యం కుంభకోణంలో అనుకోనిది జరిగితే ఏమిటి దారి అన్నది కూడా వైసీపీ పెద్దలలో ఉంది అని అంటున్నారు. ఒకవేళ జగన్ అరెస్టు అయితే వైసీపీకి సానుభూతి ఏ మేరకు వస్తుందని కూడా ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. అయితే ఇప్పటికే మద్యం కుంభకోణం విషయంలో కూటమి చాలా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ ప్రజలలో ఈ మ్యాటర్ ని పూర్తిగా చర్చకు పెట్టేసింది అని అంటున్నారు. దాంతో ఏ మేరకు సింపతీ మైలేజ్ వస్తుంది అన్నది కూడా చర్చగానే ఉందిట.

కీలక సమయంలో ఆయన లేని లోటు :

వైసీపీకి ఇపుడు ట్రబుల్ షూటర్ అన్న వారు ఎవరూ లేకుండా పోయారు అని అంటున్నారు విజయసాయిరెడ్డి గతంలో పార్టీలో ఉండేవారు. ఆయన ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేయడంతో దిట్ట అని చెప్పుకునేవారు. ఆయన కనుసన్నలలో పార్టీ వ్యవహారాలు సాగినపుడు అధినాయకత్వం మీద ఈగ వాలకుండా చూసుకున్నారు అని అంటున్నారు. ఇపుడు చూస్తే కోటరి అని పేరు ఉంది కానీ ఎవరూ ఆయన స్థాయిలో సాయం చేసేవారు వ్యూహం పన్నేవారూ లేరని అంటున్నారు. వైసీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా వైవీ సుబ్బారెడ్డి ఉన్నా ఆయనకు ఢిల్లీలో విజయసాయిరెడ్డి స్థాయిలో లాబీయింగ్ అన్నది తెలియదనే అంటున్నారు మొత్తం మీద వైసీపీని అన్ని వైపులా సమస్యలు చుట్టుముడుతున్న వేళ విజయసాయిరెడ్డి గుర్తుకు వస్తున్నారా అన్న చర్చ కూడా సాగుతోందిట.

# ఉత్తరాంధ్రాలో బాబు మెచ్చిన ఎమ్మెల్యే!



అమరావతి,టీడీపీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు మెప్పు పొందడం అంటే చాలా కష్టమైన విషయం. ఆయన అన్ని అంశాలను నిశితంగా పరిశీలిస్తారు. ఆయనది దాదాపుగా యాభై ఏళ్ల రాజకీయ అనుభవం. పైగా ఆయన క్షేత్ర స్థాయి నుంచి ఎదిగి వచ్చిన నాయకుడు. అందువల్ల ఆయనకు ఎక్కడ ఏమిటి ఎలా ఉంది అన్నీ తెలుస్తాయి. అంతే కాదు ఆయనకు వివిధ రకాలుగా సమాచారం ఎప్పటికప్పుడు వస్తూనే ఉంటుంది. దాంతో ఆయన ప్రతీ ఎమ్మెల్యే విషయంలో తనదైన అంచనాను కలిగి ఉంటారు.

ఆయనకు మంచి మార్కులు :

అయితే టీడీపీలో ఉన్న 135 మంది ఎమ్మెల్యేల పనితీరు మీద ఎప్పటికప్పుడు బాబు సర్వేలు జరిపిస్తూ వస్తున్నారు. అంతే కాదు పార్టీ పరంగా ప్రభుత్వం పరంగా వారు చేపట్టిన కార్యక్రమాలు వాటికి వస్తున్న స్పందన వంటి వాటి మీద కూడా అధ్యయనం చేయిస్తూ ఉంటారు. ఆ విధంగా వచ్చిన నివేదికలో ఉత్తరాంధ్రా జిల్లాల నుంచి ఆ ఎమ్మెల్యేకు మంచి మార్కులు పడ్డాయని అంటున్నారు. ఆయన తొలిసారి ఎన్నికైన ఎమ్మెల్యే. అంతకు ముందు టీడీపీ నుంచి ఎంతో మంది సీనియర్లు ఉన్నా వారిని పక్కన పెట్టేసి ఆయనకు చాన్స్ ఇచ్చారు. దానికి తగినట్లుగా ఆయన వ్యవహరించి బాబు మెప్పు పొందారు. ఆయనే పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర.

బాబుని కలసిన ఎమ్మెల్యే :

ఇదిలా ఉంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర తాజాగా కలిశారు.పార్వతీపురం నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులను, సమస్యలను వివరించి నిధులు విడుదల చేయాలని ఈ సందర్భంగా కోరారు. అలాగే ఇటీవల నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం విజయవంతం చేసినట్లుగా ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర బాబూకు వివరించారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుండి మంచి స్పందన వచ్చిందని తెలిపారు.

దిశా నిర్దేశంతో ఉత్సాహం :

పార్వతీపురం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు ప్రాజెక్టులకు నిధులు మంజూరుకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే చెబుతున్నారు. పార్వతీపురం నియోజకవర్గంలో 87.97 శాతం మేర అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించిన ఎమ్మెల్యేగా బాబు ఆయనను మెచ్చుకున్నారు. అందువల్లనే మంచి ర్యాంకు సాధించారని అభినందించారు. ఇదే ఊపుతో మరింత వేగంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని చంద్రబాబు ఎమ్మెల్యేకు సూచించారు. మొత్తం మీద ఉత్తరాంధ్ర నుంచి ఒక ఎమ్మెల్యేను బాబు అభినందించడం ఆయన పనితీరుని మెచ్చుకుని మంచి ర్యాంక్ ఇవ్వడం పట్ల టీడీపీలో చర్చ సాగుతోంది. రాజకీయంగా కొత్త అయిన బోనెల విజయచంద్రను తీసుకుని వచ్చి 2024లో టికెట్ ఇస్తే అతి తక్కువ కాలంలో సీఎం నుంచి మెచ్చుకోలు పొందడం మామూలు విషయం కాదని అంటున్నారు. ఆయన స్ఫూర్తితో మిగిలిన వారు కూడా పనిచేయాలని కోరుతున్నారు.

# ఆపరేషన్ సిందూర్ పై కీలక వ్యాఖ్యలు!

న్యూఢిల్లీ,పధాని నరేంద్ర మోడీ ఏ ప్రాంతంలో పర్యటించినా.. ఎక్కడ ప్రసంగించినా.. మీడియా ముందుకు వచ్చినా.. కచ్చితంగా ఆపరేషన్ సిందూర్ గురించి ప్రస్తావిస్తున్న సంగతి తెలిసిందే. ఉగ్రవాదులకు, వారిని పెంచి పోషిస్తున్న వారికీ భారత్ దెబ్బ రుచి చూపించిన విషయాన్ని వెల్లడిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా తమిళనాడులో పర్యటించిన మోడీ.. మరోసారి ఆపరేషన్ సిందూర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.అవును... మాల్దీవుల పర్యటన ముగించుకున్న ప్రధాని నరేంద్ర మోడీ. రాత్రి తమిళనాడులోని తూత్తుకుడికి చేరుకున్నారు. ప్రత్యేక విమానంలో, తమిళుల సంప్రదాయ దుస్తులలో విచ్చేసిన మోడీకి రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవి, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, ఎల్.మురుగన్, రాష్ట్ర మంత్రి తంగం తెన్నరసు తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలు ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు.ఇందులో భాగంగా... రూ.450 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తూత్తుకుడి విమానాశ్రయంలో విస్తరించిన కొత్త టెర్మినల్ ను మోడీ ప్రారంభించారు. ఇదే సమయంలో... రాష్ట్రంలో రూ.4,900 కోట్లతో పూర్తిచేసిన వివిధ రైల్వే మార్గాలను, రహదారులను ఆయన జాతికి అంకితం చేశారు. అనంతరం మాట్లాడుతూ... బ్రిటన్, మాల్దీవుల పర్యటనల ఫలితాలకు సంబంధించిన కీలక అప్ డేట్స్ ఇచ్చారు.ఈ క్రమంలో... బ్రిటన్, మాల్దీవుల పర్యటనల్లో చారిత్రక ఒప్పందాలపై సంతకాలు చేసినట్లు చెప్పిన మోడీ... ఆత్మవిశ్వాసంతో భారత్ అభివృద్ధి చెందుతోందని అన్నారు. ఈ సందర్భంగా.. గత 11 ఏళ్లలో రహదారులు, ఇంధనం, విమానాశ్రయాలు సహా తమిళనాడులో పలు పథకాలను పూర్తి చేసినట్లు చెప్పారు. తూత్తుకుడి విమానాశ్రయం కొత్త టెర్మినల్ ద్వారా ఏడాదికి 20 లక్షల మంది రాకపోకలు సాగించొచ్చన్నారు.ఈ నేపథ్యంలోనే పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన సైనిక చర్య



"ఆప్రేషన్ సిందూర్" గురించి ప్రధాని మాట్లాడారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఇందులో భాగంగా... ఆపరేషన్ సిందూర్ తో భారత్ బలం తెలిసిందని, ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేయడంలో 'మేక్ ఇన్ ఇండియా' కీలక పాత్ర వహించిందని ప్రధాని అన్నారు.ఇక తూత్తుకుడి విమానాశ్రయంలో విస్తరించిన కొత్త టెర్మినల్ విషయానికొస్తే... 17,340 చదరపు మీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఈ టెర్మినల్.. రద్దీ సమయాల్లో 1,350 మంది ప్రయాణికులను, ఏడాదికి 20 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించడానికి వీలుగా ఉంటుందని చెబుతున్నారు. 100 శాతం ఎల్.ఈ.డీ లైటింగ్, ఆన్-సైట్ మురుగునీటి శుద్ధి కర్మాగారం ద్వారా శుద్ధి చేయబడిన నీటి పునర్వినియోగంతో టెర్మినల్ నిర్మించబడింది.ఈ ఆధునిక మౌలిక సదుపాయాలు దక్షిణ తమిళనాడులో ప్రాంతీయ వాయు కనెక్టివిటీని గణనీయంగా మెరుగుపరుస్తాయని.. తద్వారా పర్యాటకం, వాణిజ్యం, పెట్టుబడులను ప్రోత్సహిస్తాయని భావిస్తున్నారు.

# తెలంగాణా రాష్ట్రం క్రెడిట్ జైపాల్ రెడ్డి దేనా ?

హైదరాబాద్,జైపాల్ రెడ్డి తెలంగాణా రాజకీయాల్లో అత్యంత సీనియర్ నాయకుడు. మొదట్లో కాంగ్రెస్ వ్యతిరేక భావజాలంతో రాజకీయాలు చేసిన ఆయన తరువాత రోజులలో అదే కాంగ్రెస్ లో చేరి ఉన్నత పదవులు అలంకరించారు. ఆయన కేంద్ర మంత్రిగా కీలక శాఖలను చూశారు. యూపీఏ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్నపుడు తెలంగాణా ఉద్యమం స్టార్ట్ అయింది. అయితే ఆ సమయంలో జైపాల్ రెడ్డి పోషించిన అతి ముఖ్య పాత్ర వల్లనే తెలంగాణా రాష్ట్ర సాధన జరిగింది అన్నది ఒక అభిప్రాయంగా చాలా మందిలో ఉంది. దానిని ఇపుడు తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గట్టిగా నొక్కి చెబుతూ జైపాల్ రెడ్డి వల్లనే రాష్ట్ర సాధన జరిగిందని స్పష్టం చేశారు.

జైపాల్ రెడ్డి వల్లనే సాధ్యమైందా :

తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు కోసం తొలి విడత పోరాటం 1960 దశకం చివరిలో జరిగింది. మలిదశ పోరాటం 1990 దశకం చివరిలో మొదలైంది. ఇక కేసీఆర్ టీడీపీ నుంచి బయటకు వచ్చి తెలంగాణా రాష్ట్ర సమితిని ప్రారంభించారు. ఆ తరువాత ఉద్యమం ఊపందుకుంది అన్నది ఉంది. అయితే కేంద్ర స్థాయిలో ఎంతో బలంగా ఉంటూ యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు కేంద్ర మంత్రిగా ఉన్న జైపాల్ రెడ్డి చేసిన ప్రయత్నాల ఫలితంగానే తెలంగాణా వచ్చిందని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. జైపాల్ రెడ్డి మెమోరియల్ అవార్డు ప్రదానం సందర్భంగా హైదరాబాద్ లో జరిగిన సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి కీలక వ్యాఖ్యలు చేసారు.

ఆయన కృషి ఫలితమే రాష్ట్రం :

జైపాల్ రెడ్డి చాలా అనుభవం కలిగిన వారు. మేధావిగా ఉన్నారు. కాంగ్రెస్ అధినాయకత్వానికి ఆయన అత్యంత సన్నిహితంగా ఉన్నారు. ఆ విధంగా ఆయన చేసిన కృషి ఫలితమే ఈ రోజు అంతా అనుభవిస్తున్న తెలంగాణా అని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పాటులో జైపాల్ రెడ్డి పాత్ర అతి ముఖ్యమైనది అని ఆయన చెప్పారు అంతే కాదు ఎన్నడూ మరువలేనిది అన్నారు. జైపాల్ రెడ్డి అన్న నాయకుడు లేకపోతే తెలంగాణా అన్న కల సాకారం అయ్యేది కాదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

సోనియాగాంధీ ఏం చెప్పారంటే :

జైపాల్ రెడ్డి వల్లనే తెలంగాణా సాధ్యమైందని ఎవరో చెప్పడం కాదు కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీయే ఆ మాట చెప్పారు అని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. జైపాల్ రెడ్డి తెలంగాణా రాష్ట్రం కోసం ఎంతో చొరవ చూపారని ఒక సందర్భంలో సోనియా గాంధీ అన్నారని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో ఆయన పాత్రను ఆయన కృషిని ఎవరూ మరచిపోలేనిది అని ముఖ్యమంత్రి చెప్పారు.

పీవీ తరువాత ఆయనే :



తెలంగాణా నుంచి జాతీయ స్థాయికి ఎదిగిన జైపాల్ రెడ్డి పీవీ నరసింహారావు తరువాత అంతటి పేరు సాధించారని రేవంత్ రెడ్డి అన్నారు. దాదాపుగా నాలుగు దశాబ్దాల పాటు రాజకీయాల్లో ఉన్న జైపాల్ రెడ్డి అజాత శత్రువుగా ఉన్నారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఆయన రాజకీయ ప్రత్యర్థులను కూడా సిద్ధాంతపరంగా వ్యతిరేకించారు తప్ప వ్యక్తిగతంగా కాదు అన్నారు. ఆయన కృషి వల్లనే సమాచార హక్కు చట్టంతో పాటు అనేక సంస్కరణలు కూడా వచ్చాయని రేవంత్ రెడ్డి అన్నారు.

రాజకీయాలు ప్రమాదకరం :

వర్తమాన రాజకీయాలు కడు ప్రమాదకరంగా తయారు అయ్యాయని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సిద్ధాంతపరమైన రాజకీయం పోయిందని అన్నారు. స్విగ్గీ రాజకీయాలు వచ్చాయని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య విలువలతో కూడిన రాజకీయాలు పోయి పొలిటికల్ మేనేజ్మెంట్ తో కూడిన రాజకీయాలు వచ్చాయని రేవంత్ రెడ్డి అన్నారు.

## రాహుల్‌ను అంబేడ్కర్‌తో పోల్చడమా

న్యూఢిల్లీ, ఓబీసీ సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లను పూర్తిగా అర్థం చేసుకోవడంలో విఫలమయ్యానని, దానిని సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తున్నానని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ రాహుల్ గాంధీ ఢిల్లీ తల్కటోరా స్టేడియంలో చేసిన వ్యాఖ్యలపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. రాహుల్‌కు కాంగ్రెస్ నేత ఉదిత్ రాజ్ మద్దతుగా నిలిచారు. ఓబీసీలకు రాహుల్ శుక్రవారం నాడు మాట్లాడుతూ, 2004 నుంచి తాను రాజకీయాల్లో ఉంటు-న్నానని, అయితే ఓబీసీ సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లను తాను పూర్తిగా అర్థం చేసుకోవడంలో చారిత్రాత్మకంగా విఫలమయ్యానని అంగీకరించారు. వ్యవసాయ ఉత్పత్తి, మౌలిక సదుపాయాల అభివృద్ధి సహా దేశ ఉత్పాదక శక్తికి ఓబీసీలు ప్రాతినిధ్యం వహిస్తున్నా వారికి తగిన గుర్తింపు, ప్రతిఫలం లభించడం లేదన్నారు.

# ఎప్పుడూ అవే మాటలా ట్రంప్... కాస్తైనా ఏమీ అనిపించదా?



సెంట్రల్ డెస్క్:ఎవరు ఎన్ని చెప్పినా.. ఎవరు ఎంత చెప్పినా.. వాస్తవం ఏమిటో తనకు పూర్తిగా తెలిసినా.. ట్రంప్ మాత్రం మారడం లేదు! తనకు అనిపించింది చెప్పుకుంటూ, చేసుకుంటూ పోతున్నారు! నవ్విపోదురు గాక నాకేటి అన్నట్లుగా ట్రంప్ వ్యవహారశైలి ఉందనే కామెంట్లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ మరోసారి భారత్ – పాక్ మధ్య జరిగిన యుద్ధం గురించి ప్రస్థావించారు!అవును. మొన్న భారత్ – పాక్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానని.. ఇటీవల ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య యుద్ధం ఆగడానికి తానే కారణమని.. అయినప్పటికీ తనకు నోబెల్ శాంతి బహుమతి రాదని చెప్పుకుంటున్న ట్రంప్.. శాంతి బహుమతి ప్రేమతో గెలిస్తే వస్తుంది తప్ప.. బెదిరించో, బలవంతం పెట్టో చేయిస్తే రాదనే విషయాన్ని మరిచిపోతున్నారనే మాటలకు అవకాశం ఇస్తున్నారు!ఈ క్రమంలో తాజాగా థాయిలాండ్ – కంబోడియా దేశాల మధ్య మొదలైన ఘర్షణపై స్పందించారు. ఈ సమయంలో కాల్పుల విరమణ చర్చలకు తక్షణమే అంగీకరించారని ప్రకటించారు. తాను కంబోడియా ప్రధాని హున్ మానెట్, థాయ్ ప్రధాని ఫుమ్తామ్ వెచియాచైతో మాట్లాడినట్లు చెప్పిన ట్రంప్.. వారు యుద్ధం కొనసాగిస్తే.. అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు దెబ్బతింటాయని హెచ్చరించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా... సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన ట్రంప్... ఇరు వర్గాలు తక్షణమే కాల్పుల విరమణ.. శాంతి కోసం ఎదురు చూస్తున్నాయని రాశారు. ఇదే సమయంలో.. ఇరు దేశాలు అమెరికాతో వాణిజ్య చర్చలు జరపడానికి తొందరపడుతున్నాయని చెప్పారు. ఆ రెండు దేశాలకు సుదీర్ఘమైన సాంస్కృతిక, చారిత్రక నేపథ్యం ఉందని చెప్పారు.ఈ విధంగా... తాను కంబోడియా, థాయ్ ప్రధానులతో మాట్లాడానని.. వారు యుద్ధం కొనసాగిస్తే, అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు దెబ్బతింటాయని హెచ్చరించినట్లు చెప్పిన ట్రంప్... దీన్ని చూస్తుంటే తాను విజయవంతంగా నిలిపివేసిన భారత్ – పాక్ యుద్ధమే గుర్తుకువస్తోందంటూ పాత పాటే పాడారు! దీంతో.. ట్రంప్ పై నెటిజన్లు మరోసారి విరుచుకుపడుతున్నారు.కాగా.. భారత్ పాక్ మధ్య కాల్పుల విరమణకు.. అమెరికాతో వాణిజ్యానికి.. ట్రంప్ పాత్రకు ఎలాంటి సంబంధం లేదని భారత్ ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ.. ప్రపంచ వేదికలపై ట్రంప్ ఈ తరహా ప్రకటనలు మాత్రం మానడం లేదు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com